అనుదినం... జనస్వరం
# నవతెలంగాణ
శుక్రవారం 07-02-2020
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 6 | సంచిక : 40 | Published from Hyderabad, Rangareddy, Karimnagar, Khammam | www.navatelangana.com | 10 + 16 పేజీలు | వెల : 6.50






## వనం నుంచి గద్దెకు సమ్మక్క

గౌరవ సూచకంగా గాల్లోకి మూడురౌండ్ల కాల్పులు

- కిటకిటలాడుతున్న మేడారం జాతర

వివరాలు 5లో..

## సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

త్వరలోనే కొత్త పోస్టింగ్‌లు

- అనుకూల ఎస్పీల కోసం కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పైరవీలు

వివరాలు 5లో..




## కార్పొరేట్లకు దోచిపెట్టడమే



# దేశభక్తా..?

## ప్రజా సంపదను కొల్లగొట్టేలా కేంద్ర బడ్జెట్..



### ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి: పార్లమెంట్ ఎదుట సీపీఐ(ఎం) ఎంపీల ఆందోళన

**నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని సీపీఐ(ఎం) ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని సత్వరమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో సీపీఐ(ఎం) ఎంపీలు ధర్నా చేశారు. "పీఎస్‌యూల ప్రయివేటీ కరణ వద్దు. జాతి సంపదను ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వొద్దు. కేరళ పట్ల వివక్ష చూపొద్దు" అనే ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు. "పీఎస్‌యూలను మూయొద్దు. ఎల్ఐసీని ప్రయివేటీకరణ చేయొద్దు. బీపీసీఎల్‌ను ప్రయివేటీకరణ చేయొద్దు. రైతు వ్యతిరేక బడ్జెట్ డౌన్‌డౌన్. ప్రజా వ్యతిరేక బడ్జెట్ డౌన్‌డౌన్, యువత వ్యతిరేక బడ్జెట్ నశించాలి" అంటూ గళమెత్తారు. ఈ సందర్భంగా ఎంపీ ఎలమారం కరీం మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనదనీ, జాతి వ్యతిరేకమైనదని విమర్శించారు. దేశంలోని ప్రజా ...5లో

# సైకోకు ఉరిశిక్ష

## హాజీపూర్ వరుస హత్యకేసుల్లో శ్రీనివాస్‌రెడ్డి దోషిగా నిర్ధారణ

- పోక్సో కోర్టు సంచలన తీర్పు
- 90 రోజుల్లో 101 మంది సాక్షుల వాంగ్మూలం సేకరణ
- హాజీపూర్ గ్రామస్థుల ఆనందోత్సాహాలు



**నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన హాజీపూర్ వరస హత్యల కేసు దోషికి కోర్టు మరణశాసనం రాసింది. నేరస్థుడు శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. తీవ్ర ఉత్కంఠ నడుమ ఈ జడ్జిమెంట్ వచ్చింది. ఇటీవలే సమత హత్య కేసులో నిందితులకు ఉరిశిక్ష పడటం, నిర్భయ కేసులో ఉరిశిక్ష ఖరారు కావడంతో ఈ కేసు తీర్పుపైనా ఉత్కంఠ నెలకొంది. ముగ్గురు బాలికలపై లైంగికదాడి చేసి, ఆపై క్రూరంగా చంపేసిన మానవమృగం శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్షతో పాటు రూ.12600 జరిమానా విధించడంపై బాధితులు, హాజీపూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన సైకో కిల్లర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్ నంబర్లు 110, 109 కేసుల్లో ఉరిశిక్ష, మరో కేసు111లో...5లో

లక్నో డిఫెన్స్ ఎక్స్‌పోలో రైఫిల్‌ను గురిపెడుతున్న మోడీ







L&T Metro Rail (Hyderabad) Limited is proud, as
Hon'ble Chief Minister of Telangana State, Sri K. Chandrashekar Rao
dedicates Corridor II : Green Line - JBS to MGBS,
Hyderabad Metro Rail to the citizens of Hyderabad today!

Highlights of the Hyderabad Metro Rail Project

- The world's largest Public-Private Partnership (PPP) project in the metro sector
- JBS - MGBS - 11 Kms – 9 stations - Corridor II - Green Line. The Hyderabad Metro Rail Project is dedicated to the citizens of Hyderabad
- 9 Stations – JBS, Secunderabad West, New Gandhi Hospital, Musheerabad, RTC X Roads, Chikkadpally, Narayanguda, Sultan Bazar and MG Bus Station
- JBS - Hyderabad's second largest bus terminus; Parade Ground Station, the tallest metro station with 5 levels
- 69.2 Km network will now be in operation with the inauguration of the JBS to MGBS stretch
- Best-in-class, eco-friendly urban mobility system for the people of Hyderabad
- Project utilises cutting edge technologies (Communication Based Train Control, Modern Regenerative Rolling Stocks, Ballast less Tracks, QR Code Ticketing, etc.)
- The project has already won 150 plus awards thus far

The World's Largest PPP Metro Project
India's Second Biggest Operating Metro Network

L&T Metro Rail Hyderabad

www.ltmetro.com ltmhyd ltmhyd lthydmetrorail

# కౌన్ బనేగా ఢిల్లీకా బాస్

**న్యూఢిల్లీ:** ఒకరిది హిందూత్వ భావోద్వేగాల (సెంటిమెంట్స్‌)పై ఆధారపడిన ఓటుబ్యాంక్ రాజకీయం, మరొకరిది ఐదేండ్ల పాలనలో చేపట్టిన కార్యక్రమాలే పెట్టుబడి అన్నతీరు. ఇంకొకరిది ఆ ఇద్దరికీ సాధ్యంకాని వాగ్దానాల మోత.. మొత్తమ్మీద గురువారం సాయంత్రానికి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. చివరి రోజైన గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ స్టార్ క్యాంపెయినర్ స్వప్నా చౌదరి అక్కడి గల్లీల్లో ర్యాలీ నిర్వహించారు. మీ ఓటు ఎవరికి అని ఓటర్లను అడిగితే కేజ్రీవాలే కే అన్న సమాధానం రావటంతో షాక్‌కు గురయ్యారు. అయితే ఈ ఎన్నికల్లో ఆప్,బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముక్కోణపు పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని ఏడు పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో అంత సీన్ లేదన్న సర్వేల నేపథ్యంలో కేంద్రంలోని మోడీ సర్కార్ తన చివరి అస్త్రాన్ని బయటకు తీసింది. రామ బాణానికి తిరుగులేదన్న హిందూ సంప్రదాయికవాదుల సెంటిమెంట్‌ను బీజేపీ తన చివరి అస్త్రంగా ప్రయోగించింది. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం' పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు బుధవారం లోక్‌సభలో ప్రధాని మోడీ ప్రకటించిన తీరును రాజకీయ పరిశీలకులు ఆ కోణంలోనే చూస్తున్నారు. ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలన్నదే బీజేపీ




ప్రణాళిక.. 2015 ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలున్న ఢిల్లీలో ఆమ్‌ఆద్మీపార్టీకి 67, బీజేపీకి 3 సీట్లు రాగా, కాంగ్రెస్ ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయింది. ఈ మూడు పార్టీలకు వరుసగా ఆ ఎన్నికల్లో 54.3 శాతం, 32.2 శాతం, 9.7 శాతం చొప్పున ఓట్లు పోలయ్యాయి.

ఈ నెల 8న పోలింగ్ జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ తీర్పు ఎలా ఉంటుందన్నది ఉత్కంఠ కలిగిస్తోంది. ఈ ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌సహా 240మంది ఎంపీలను బీజేపీ రంగంలోకి దింపిందంటే వైరి పక్షాల నుంచి పోటీని ఆ పార్టీ ఏ స్థాయిలో ఊహిస్తుందో అర్థం చేసుకోవాల్సిందే. సీఏఏకు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో స్థానిక ముస్లిం మహిళలు చేపట్టిన నిరంతర ఆందోళన అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆ ఆందోళన వెనుక ఆప్, కాంగ్రెస్ ఉన్నాయంటూ బీజేపీ సాగిస్తున్న ప్రచారం మెజారిటీ ఓటర్లను ప్రభావితం చేయడం ద్వారా లబ్ది పొందాలన్న హిందూత్వ రాజకీయ ఎజెండాలో భాగమేనన్నది తేలిగ్గా అర్థమయ్యేదే..

2019 ఎన్నికల తర్వాత మోడీ సర్కార్ అధికారికంగా వెల్లడించిన జీడీపీ గణాంకాలు సైతం దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంవైపు పయనిస్తోందన్న ఆర్థికవేత్తల వ్యాఖ్యలకు బలం చేకూర్చాయి. దాంతో, ఢిల్లీలోని తెలివైన ఓటర్లెవరూ బీజేపీవైపు మొగ్గు చూపరన్న విశ్లేషణలున్నాయి. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ సర్కార్ అధికారం చేపట్టిన తర్వాత నీటి బిల్లులు, విద్యుత్ బిల్లులు తగ్గించడం(200 యూనిట్ల వరకూ విద్యుత్ ఫ్రీ), మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరచడం, వైఫై ఫ్రీలాంటివి పేద, మధ్యతరగతి వర్గీయులకు కొంత ఊరట కలిగించిన నిర్ణయాలు, మరోవైపు కాంగ్రెస్ తన వాగ్దానాల ద్వారా చీల్చే ఓట్ల వల్ల ఆప్‌కే నష్టమని, బీజేపీకి పరోక్ష లాభమన్న విశ్లేషణలున్నాయి. దీంతో, ఢిల్లీ అసెంబ్లీలో మెజారిటీ స్థానాలు ఎవరికన్నది తేల్చి చెప్పడం అంత సులభమేమీ కాదని అర్థమవుతోంది.

**అనుకున్నదొక్కటీ.. అయ్యింది ఒక్కటీ..!**
**బీజేపీ ప్రచారకర్త సప్నకు ఊహించని షాక్..!!**

బీజేపీకి ప్రచారం సాగిస్తున్న హర్యానాకు చెందిన డ్యాన్సర్, గాయని సప్నా చౌదరికి ఊహించని షాక్ తగిలింది. సోమవారం ఘోండా అసెంబ్లీ స్థానం పరిధిలో ఆమె ప్రచారం చేస్తూ ఓటర్లను మీ రెవరికి ఓటేస్తారంటూ ప్రశ్నించారు. వారంతా కేజ్రీవాల్‌కంటూ సమాధానమిచ్చారు. దాంతో, కాస్త కలత చెందిన సప్న మరోసారి అదే ప్రశ్న అడగ్గా, వారీసారి బిగ్గరగా కేజ్రీవాల్‌కంటూ అరవడంతో అవాక్కయ్యారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

**బీజేపీకి మరో షాక్..!**
**ఎదురు తిరిగిన కార్పొరేటర్లు..?**

ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీకి కార్పొరేటర్లు ఎదురు తిరిగినట్టు ఆ పార్టీకి చెందిన ఓ స్థానిక నేత తెలిపారు. ఈ నెల 5న ఢిల్లీలోని తమ పార్టీ కార్పొరేటర్లతో అమిత్‌షా సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా కొందరు కార్పొరేటర్లు పార్టీ నిలబెట్టిన అభ్యర్థులకు తాము ప్రచారం చేయట్లేదని తేల్చి చెప్పారు. ఈ విధంగా చెప్పిన కార్పొరేటర్లలో కొందరు అసెంబ్లీకి టికెట్లు ఆశించినవారుగా తెలుస్తోంది. మొత్తమ్మీద వీరంతా స్థానికంగా పలుకుబడి ఉన్న నేతలుగా చెబుతున్నారు.

## నిమ్స్‌లో కాంట్రాక్టు నర్సుల విధుల బహిష్కరణ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మాట తప్పిన సర్కారుపై మరో పోరాటానికి నిమ్స్ కాంట్రాక్టు నర్సులు సిద్ధమయ్యారు. గురువారం ఉదయం నుంచి విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. దాదాపు పది, పన్నేండ్ల నుంచి చేస్తున్న సేవలను గుర్తించి వేతనాలు పెంచాలని గత నాలుగేండ్లుగా ఆయా రూపాల్లో పోరాడుతున్న సంగతి తెలిసిందే. బెడ్లకు తగినట్టు సిబ్బంది లేకపోయినా రెగ్యులర్ నర్సులతో పాటు కాంట్రాక్టు నర్సులు సేవలందిస్తున్నారు. 1500 వరకు బెడ్లు ఉండగా కాంట్రాక్టు నర్సులు 375 మంది ఉన్నారు. నెలకు జీతం రూ.17000 ఇస్తుండగా దానిని పెంచాలని గత కొన్నేండ్లుగా ఉద్యమిస్తుంటే సర్కారు ఐదేండ్లులోపు సర్వీసు ఉన్న వారికి రూ.25,000, ఆ పై సర్వీసున్న వారికి రూ.30,000 పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గత ఏడాది చివర్లో ఆందోళనకు దిగిన నర్సులను తాత్కాలికంగా శాంతింపజేసింది. అయితే తాజాగా జనవరి జీతం కూడా పెంచకుండా వేయడంతో గురువారం ఉదయం కాంట్రాక్టు నర్సులు ఆందోళనబాట పట్టారు. నిమ్స్ నర్సెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశాలత, విజయకుమారి నచ్చజెప్పేందుకు చేసిన ప్రయ త్నాలు ఫలించలేదు. చర్చలకు రావాలని నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆహ్వానించినా వారు ససేమిరా అని నిమ్స్ ప్రాంగణంలోనే భీష్మించుకు కూర్చున్నారు. చర్చించేందుకు ఏమీ లేదనీ, ఎప్పుడు చెప్పే దాటవేసే మాటలను వినేందుకు సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. అనంతరం నిమ్స్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ రూపం బార్గోహేన్ దృష్టికి అసోసియేషన్ తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం లేదనీ, కనీసం సర్వీసుకు తగినట్టు కూడా జీతం ఇవ్వరా అని ప్రశ్నించారు.

**రోగులకు తప్పని తిప్పలు**

కాంట్రాక్టు నర్సుల విధుల బహిష్కరణ ప్రభావం రోగులకు అందించే సేవలపై పడింది. కాంట్రాక్టు నర్సులు కాకుండా రెగ్యులర్ నర్సులు 360 మంది నర్సింగ్ విద్యార్థులతో వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే రోగులకు సరపడినంత మంది నర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో రోగుల నుంచి నిరంతరాయంగా ఫిర్యాదులందే నిమ్స్‌లో పరిస్థితి మరింత దిగజారింది. ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని రోగులు, వారి సహాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# మేడారంలో ప్ర'జల' పాట్లు





**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

మేడారం జాతరకు పోటెత్తిన జనానికి ఈ ఏడాదీ పాట్లు తప్పడం లేదు. గత అనుభవాల దృష్టిలో పెట్టుకుని సందర్శలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పిల్లాపాపలతో వచ్చిన కుటుంబాలను నీటి కటకట వెంటాడుతున్నది. ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నప్పటికీ అవి సరిపోక మహిళలు వేసవికాలం మాదిరిగా కుస్తీ పడుతున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. ఇదే అదనుగా అత్యవసరంగా కొనుక్కుంటున్న వారి నుంచి క్యానుకు వంద రూపాయలు దండుకుంటున్నారు.

సందర్శకుల సౌకర్యార్థం మిషన్ భగీరథతో పాటు ట్యాంకులు, నల్లాలు ఏర్పాటు చేశామని అధికారులు చెబుతన్నా అక్కడ నీటి సమస్య ఎదురవుతున్నది. వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా అవి ఏమాత్రమూ సరిపోవడం లేదు. దీన్ని ఆసరా చేసుకుని 20 లీటర్ల తాగునీటి క్యాన్‌ను వంద రూపాయలకు విక్రయిస్తున్నారు. అవి కూడా బోరు నీరు కావడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ నీటి సరఫరాకు ప్రభుత్వం రూ.19 కోట్లు కేటాయించింది. రూ.2.07 కోట్లతో మూడు కొత్త ట్యాంకులు నిర్మించారు. ఆ నిధుల్లో శానిటేషన్‌కు రూ.7.50 కోట్లు, వాటర్ సప్లైకి రూ.5.32 కోట్లు కేటాయించారు. అయినా తాగునీటి సమస్యను పరిష్కరించలేకపోయారు. బోర్లు వేసినా నీటి సరఫరా జరగకపోవడంతో స్నానం కోసం ఏర్పాటు చేసిన నల్లాల నీటినే జనం తాగుతున్నారు. ముందస్తుగా స్పందించకపోవడంతోనే సమస్య ఉత్పన్నమైందని ప్రజలు వాపోతున్నారు. ఇక నల్లాల ద్వారా విడుదల చేసిన నీరు రోడ్లపై ఏరులై పారుతున్నది. దీంతో రెడ్డిగూడెం ప్రాంతం నుంచి గద్దెల వద్దకు వెళ్లే రోడ్డు, రెడ్డిగూడెం నుంచి జంపన్న వాగుకు వెళ్లే దారి పూర్తిగా బురదమయమైంది.

**పారిశుధ్యం అధ్వానం**

జాతరకు లక్షల సంఖ్యల్లో తరలిరావడంతో పారిశుధ్య సమస్య తీవ్రమైంది. వందలాది మంది కార్మికులు 24 గంటలు పనిచేస్తున్నా ఇబ్బందులు తొలగడం లేదు. సుమారు వందకుపైగా కోడి విక్రయ కేంద్రాలు ఉండటంతో చనిపోయిన కోళ్లను వ్యాపారులు ఎక్కడికక్కడే పడేస్తున్నారు. చిలుకలగుట్ట రోడ్డు సమ్మక్కను తీసుకొచ్చే దారిలో 200 కోళ్లు చనిపోవడంతో వాటిని జనాల మధ్యనే పడేశారు. మేక, కోడి వ్యర్థాలు సైతం ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. నార్లాపూర్ ప్రాంతంలోనూ ఇదే దుస్థితి. మరోవైపు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా నీరు లేక దుర్గంధభరితంగా మారాయి. అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోని నేపథ్యంలో పరిసర ప్రాంతాలన్నీ కంపుకొడుతున్నాయి.

**సరైన సౌకర్యాలు కల్పించలేదు**

జాతరలో మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉంది. ప్రతి జాతరకు వస్తున్నా ఈసారి మాత్రం సౌకర్యాలు లేక చాలా ఇబ్బందిగా మారుతున్నది. మంచినీటి కోసం గంటల తరబడి నిల్చోవాల్సి వస్తున్నది. విధిలేని పరిస్థితిలో క్యాన్‌కు రూ.100 చెల్లించి కొనుక్కున్నాం.

**- చిప్ప సతీష్, కాశీబుగ్గ (గణపురం)**

**లీకేజీపై మొరపెట్టుకున్నా అంతే..**

ప్రధాన రహదారిపై లీకేజీలతో నీరు నిలిచి బురదమయంగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.

**- కొలిపాక సత్యనారాయణ, మేడారం (గణపురం)**

## 'సహకార' ఎన్నికల్లో 2,311 నామినేషన్లు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగు కొనసాగుతున్నది. తొలిరోజు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 904 పీఏసీఎస్‌ల పరిధిలోని 11,765 డైరెక్టర్ల పదవులకు 2,311 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా నిజామబాద్ జిల్లాలో 89 పీఏసీఎస్‌ల పరిధిలో 237 నామినేషన్లు, అత్యల్పంగా జోగులాంబ-గద్వాల జిల్లాలో 11 పీఏసీఎస్‌లకు 14 నామినేషన్లు దాఖలైనట్టు సహకార శాఖ ఎన్నికల అథారిటీ వెల్లడించింది. గురువారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ సాయంత్రం 3 గంటల వరకు కొనసాగింది. శుక్ర, శని వారాల్లోనూ ఈ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. 9వ తేదీన నామినేషన్ల పరిశీలన, 10న ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయించనున్నట్టు ఎన్నికల అథారిటీ అధికారులు వెల్లడించారు.

**మొదలైన 'రైతు' నామినేషన్**

సహకార సంఘాల ఎన్నికల్లో భాగంగా తొలి ప్రక్రియ గురువారం మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహకార సొసైటీ డైరెక్టర్ పదవులకు రైతుల నుంచి నామినేషన్లు ప్రారంభమయ్యాయి. దీంతో గ్రామీణ, మండల స్థాయిలో మళ్లీ ఎన్నికల వాతావరణం సంతరించుకుంది. శనివారం సాయంత్రం వరకు నామినేషన్ల పర్వం కొనసాగనుంది. తొలిరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 217 నామినేషన్లు దాఖలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 23 సొసైటీలకు 91, గద్వాలలో 11 సంఘాలకు 14, వనపర్తిలో 66 నామినేషన్లు వచ్చాయి. మహబూబ్‌నగర్‌లో 28 మంది సహకార సంఘం డైరెక్టర్లుగా తమ నామినేషన్లను ఎన్నికల అధికారికి అందజేశారు. నారాయణపేట జిల్లాలో మొత్తం 9నామినేషన్లు దాఖలయ్యాయి. సిద్దిపేట జిల్లాలో 21 సహకార సంఘాల్లో 20, మెదక్‌లో 35 నామినేషన్లు వచ్చాయి. సంగారెడ్డి జిల్లాలో 91, జనగామ జిల్లాలో 18, మహబూబాబాద్‌లో 20, భూపాలపల్లి జిల్లాలో 40, ములుగులో 24, వరంగల్‌రూరల్ జిల్లావ్యాప్తంగా 107, వరంగల్ అర్బన్ జిల్లా 60, సూర్యాపేట జిల్లాలో 73, యాదాద్రి భువనగిరిలో 70, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 72, ఖమ్మం జిల్లాలో 106 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 68 సంఘాలకుగాను 191 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 39, నిర్మల్ 40, మంచిర్యాలలో 25, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 13, నిజామాబాద్ జిల్లాలో 237, కామారెడ్డిలో 156, కరీంనగర్ జిల్లాలో 144, పెద్దపల్లిలో 62, సిరిసిల్లలో 24 సంఘాలకు 103, జగిత్యాల జిల్లాలో 51 సంఘాలకు 137 నామినేషన్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ బకాయిలు 822 కోట్లు:ఏఐ



**న్యూఢిల్లీ:** ప్రముఖుల ప్రయాణాలు ఎయిరిండియా (ఏఐ) మనుగడకు విఘాతంగా మారుతున్నాయి. అసలే పీకల్లోతు అప్పుల్లోకి మునిగిపోయిన ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాకు.. వీవీఐపీల ప్రయాణాలు మరింత భారంగా మారుతున్నాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి ప్రముఖుల పర్యటనలకు ఎయిరిండియా వీవీఐపీ చార్టర్ విమానాలను ఏర్పాటు చేస్తూ వస్తోంది. వీటికి సంబంధించిన ఖర్చులను సంబంధిత మంత్రిత్వశాఖలు ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వీటిని ఆయా ప్రభుత్వ శాఖలు సకాలంలో చెల్లించడం లేదు. దీంతో ఎయిరిండియాకు రావాల్సిన బకాయిల మొత్తం సుమారు రూ.822 కోట్లకు పేరుకుపోయింది. ఈ విషయాన్ని స్వయంగా ఎయిరిండియా గురువారం వెల్లడించింది. వీవీఐపీ ప్రయాణాలకు సంబంధించి ఎంత ఖర్చు అవుతోంది? ఎంత బకాయిలు ఉన్నాయి? అనే విషయాల్ని తెలపాల్సిందిగా లోకేష్ బాత్రా అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద ఎయిరిండియాను కోరారు. దీనికి ఎయిరిండియా స్పందిస్తూ సమగ్రంగా సమాధానమిచ్చింది. 2019, నవంబరు 30 వరకు ప్రభుత్వం ఎయిరిండియాకు రూ.822 కోట్లు బకాయి పడినట్లు తెలిపింది.

## మేథో హక్కుల్లో దిగజారిన భారత్

- **53దేశాల్లో 40వ స్థానం**

**వాషింగ్టన్ :** ఒకదేశంలో సృజనాత్మకత, నూతన పెట్టు బడుల ఆవిష్కరణ ఏస్థాయిలో ఉందో మరోరూపంలో తెలియజేసేదే..'మేథోపరమైన హక్కులు'. ఆవిష్కరణలు, పేటెంట్లు ఎంత ఎక్కువగా పొందితే..ఆ దేశం పెట్టుబడుల వృద్ధిలో అంత ముందుంటుంది. అయితే 'మేథో హక్కుల సూచిక'లో గత ఏడాది 36వ స్థానంలో నిలిచిన భారత్ 2020లో 40వ స్థానానికి పడిపోయింది. ఈ ఏడాది ప్రపం చవ్యా ప్తంగా 53దేశాలకు ర్యాంకులు విడుదలచేశారు. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన 'గ్లోబల్ ఇన్నో వేషన్ పాలసీ సెంటర్' ఈ నివేదికను విడు దలచేస్తున్నది. గ్రీస్, డొమినికన్ రిపబ్లిక్ దేశాలు భారత్‌కు కన్నా మెరుగైన ప్రదర్శన చేసినట్టు నివేదిక తెలిపింది. 2016 నుంచి భారత్‌లో మేథోప రమైన హక్కులపై అవ గాహన పెరిగిందనీ, ట్రేడ్‌మార్క్ దరఖాస్తులకు వేగంగా పేటెం ట్లు దక్కుతు న్నాయనీ, సృజనాత్మకత, ఆవిష్కరణల రంగంలో అవగాహన పెరిగిందనీ, ఆవిష్క రణలకు, పెట్టుబడులకు రిజిస్ట్రేషన్, హక్కుల పరిరక్షణ జరుగుతున్నదని నివేదిక పేర్కొన్నది. ఈ నివేదికలో పొందుపర్చిన అంశాల్ని భారత్‌లోని రాజకీయ, ఆర్థిక విధాన రూపకర్తలు పరిగణలోకి తీసుకోవాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. మేథోహక్కుల సూచికలో భారత్ మెరుగైన స్థానం పొందగలిగితే, పెట్టుబడుల రాకను అది మరింత పెంచుతుందని నిపుణులు తెలిపారు.

## కార్పొరేట్లకు దోచిపెట్టడమే దేశభక్తా?

(మొదటిపేజీ తరువాయి)

సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని కోట్లాదిమంది సామాన్య ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పథంలో నడుస్తున్న ఎల్ఐసీ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఇది ఎల్ఐసీని ప్రయివేటీకరణ చేసేందుకు తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించేందుకు నిర్ణయిం చారనీ, ఇప్పుడు ఎల్ఐసీని కూడా అందులో భాగం చేశారని విమర్శించారు. దేశభక్తి గురించి ప్రచారం చేసుకునే మోడీ సర్కార్ కార్పొరేట్లకు ఊడిగం చేయడమే దేశభక్తా ..?అని ప్రశ్నించారు. ఏండ్ల నుంచి కూడబెట్టుకున్న జాతి సంపదను కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలను విస్మరించారనీ, కేవలం ఒక వర్గాన్నే ప్రభుత్వం గుర్తు పెట్టుకొన్నదనీ, అదే కార్పొరేట్ వర్గమని విమర్శించారు. రైతులు, కార్మికులు, యువతకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిం దన్నారు. సీపీఐ(ఎం) ఎంపీల ఆందోళనలో కర్నాటకకు చెందిన కాంగ్రెస్ రాజ్య సభ ఎంపీ బికె హరిప్రసాద్, జైరామ్ రమేష్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎంపీలు టికె రంగరాజన్, కె.సోంప్రసాద్,జర్నాదాస్ బైద్య,కెకె రాగేష్, ఆరిఫ్, పీఆర్ నటరాజన్, ఎస్. వెంకటేషన్ పాల్గొన్నారు.

## అంతులేని దారుణాలు

- **సూర్యాపేట, సంగారెడ్డి జిల్లాల్లోముగ్గురు హతం**

**నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్/పటాన్‌చెరు/మల్కాజిగిరి**

సూర్యాపేట, సంగారెడ్డి జిల్లాల్లో గురువారం దారుణ హత్యలు జరిగాయి. ఆస్తి కోసం మారుతల్లి, చెల్లెలును రోకలి బండతో మోది హతమార్చగా.. మరో ఘటనలో లారీ గైడ్‌ను దుండగులు దాడి చేసి చంపేశారు. అతనితో మరో గైడ్ రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉండగా ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో గంజాయి కోసం జరిగిన ఘర్షణలో కత్తులతో దాడి చేయడంతో ఒకరి పరిస్థితి విషమంగామారింది. సూర్యాపేట మండలం తాళ్ల ఖమ్మంపాడుకు చెందిన కప్పల నాగయ్య మొదటి భార్య అచ్చమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమె సోదరి అంజమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు కుతురు, కుమారుడు ఉండగా రెండో భార్యకు కుమార్తె ఉంది. 13 ఏండ్ల క్రితం నాగయ్య మృతిచెందాడు. పదెకరాల వ్యవసాయ భూమితో పాటు సూర్యాపేట పట్టణంలో ఇంటి స్థలం ఉండగా.. వాటి విలువ సుమారు రూ.2 కోట్లకుపైనే. నాగయ్య మృతి అనంతరం పలుమార్లు పెద్ద సమక్షంలో పంచాయితీ జరగడంతో ఇద్దరి భార్యలకు సగం పంచారు. రెండో భార్య అంజమ్మకు దక్కిన నాలుగెకరాల భూమిని కూడా కొడుకు కాజేయాలనుకున్నాడు. గురువారం తెల్లవారుజామున మారుతల్లి అంజమ్మ (35), చెల్లి మౌనిక(18) నిద్రిస్తుండగా వారి తలలపై రోకలి బండతో మోదాడు. మౌనిక అక్కడికక్కడే మృతిచెందగా.. అంజమ్మ తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని ఏరియాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందింది. నిందితుడు హరీష్ పరారీలో ఉన్నాడు. సూర్యాపేట డీఎస్పీ నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరు గ్రామానికి చెందిన మొయినుద్దీన్ గత రెండేండ్లుగా రుద్రారం గ్రామ పరిధి గణేష్ గడ్డ వద్ద గుడిసెలో టీ, టిఫిన్లు అమ్ముకుంటున్నాడు. దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చే భారీ వాహనాలకు దారిచూపే గైడ్లు కొందరు మొయినుద్దీన్ గుడిసెలో నిద్రిస్తారు. బుధవారం రాత్రి హాజీ (35), అశోక్ (28) నిద్రించగా ఉదయం ఆరు గంటలకు హోటల్ తెరిచేసరికి వారిద్దరూ రక్తపు మడుగులో పడి ఉన్నారు. హాజీ అప్పటికే చనిపోయాడు. గాయాలతో ఉన్న అశోక్‌ను సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి, అనంతరం గాంధీకి తరలించారు. సీఐ నరేష్ కేసు దర్యాప్తు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ చందనా దీప్తి, అడిషనల్ ఎస్పీ సృజన, జహీరాబాద్ డీఎస్పీ గణేష్‌యాదవ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు హాజీ హైదరాబాద్‌లోని బోరబండ, అశోక్ మెదక్ జిల్లా పాపన్నపేట మండలం లింగాయపల్లికి చెందినవారిగా గుర్తించారు.

**స్నేహితుల మధ్య గంజాయి వివాదం**

మల్కాజిరిగి పరిధిలోని గౌతమ్‌నగర్‌లో ముగ్గురు స్నేహితులు మున్నా, కెల్విన్ రాజు, మహేందర్ గంజాయికి అలవాటు పడ్డారు. వారికి గంజాయి విషయంలోనే గొడవ జరగడంతో మున్నా అనే వ్యక్తిపై కెల్విన్ రాజు, మహేందర్ కలిసి కత్తితో దాడి చేశారు.

# వనం నుంచి గద్దెకు సమ్మక్క

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

వీరనారి సమ్మక్క వనం నుంచి జనంలోకి తరలివచ్చింది. కారడవి చిలుకల గుట్ట నుంచి నిండుపున్నమి వేళ గురువారం రాత్రి గద్దెకు చేరింది. తల్లి రాకతో మేడారం ప్రధాన ఘట్టం ఆవిష్కృతమైంది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడంతో మేడారం జాతరలో రెండో ఘట్టం ముగిసింది. తల్లుల దీవెనల కోసం జనం పెద్దఎత్తున తరలిరావడంతో మేడారం ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మేడారం జాతరలో సమ్మక్కను గిరిజన సంప్రదాయాలతో గద్దెపైకి తీసుకొచ్చే రెండోఘట్టం గురువారం అత్యంత వైభవంగా ముగిసింది. వడ్డెలు(పూజారులు) తెల్లవారుజామున 4 గంటల నుంచి పూజలు నిర్వ హించి, చిలుకలగుట్టలో పూజలు చేసి వెదురుమం డలను వెంట తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12గంటల వేళ ప్రధాన పూజారికొక్కెర కృష్ణయ్య ఇంట్లో పూజారులు సిద్దబోయిన మునీందర్, లక్ష్మన్ రావు, జగ్గారావు, మల్లెల ముత్తయ్య, చందా గోపాల్ సమ్మక్కకు కావాల్సిన అలంకరణ తంతు నిర్వహిం చారు. బోనాలను డోలు వాయిద్యాలతో గద్దె వద్దకు తీసుకొచ్చి వెదురు కర్రను అక్కడ ఉంచి వెళ్లారు. అక్క డ్నుంచి సమ్మక్క గుడికి చేరుకొని గద్దెల్ని శుభ్రం చేశారు. సాయంత్రం వేళ పూజారులు చిలుకలగుట్ట చేరుకుని ఇప్పపువ్వు సారతో పాటు కుంకుమ, పసు పు, ఎరుపు, తెలుపు పట్టు వస్త్రాలను చిలుకలగుట ్టలోని రహస్య ప్రదేశం లో అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమం జరిగేప్పుడు గుట్ట పైకి ఎవరినీ వెళ్లనీయ కుండా ఆదివాసీ గిరిజనులు వలయాకారంగా ఏర్పడి రక్షణగా నిలిచారు. సమ్మక్క ప్రతిమలతో పూజారులు చిలుకలగుట్ట దిగారు. అప్పటికే మూడు రక్షణ వల యాలుగా ఏర్పడిన పోలీసులు పూజారుల్ని తమ వలయంలోకి తీసుకొని వాగుదాటించారు. మంత్రు లు దయాకర్‌రావు, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు సీతక్క, పొదెంవీరయ్య, ఎన్‌రవీందర్, ములుగు జెడ్పీ చైర్మెన్ కుసుమా జగదీష్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్, ఎస్పి సంగ్రామ్‌సింగ్ కార్యక్రమాన్ని దగ్గరుండి వీక్షిం చారు. 6.37 గంటల సమయంలో సమ్మక్క వాగు దాటి రోడ్డుపైకి రాగానే గౌరవ సూచకంగా ఎస్పీ మూడురౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. శివస త్తుల పూనకాలు, కేరింతలు, డోలువాయిద్యాలు, జమిడిక మోతలతో అడవీప్రాంతం మారుమోగింది. మర్గంమధ్యలో సమ్మక్క దేవాలయం వద్ద ఎదుర్కోళ్ల ద్వారా మేడారం ఆడపడుచులు ఆలయంలోకి తోడ్కొ ని పోయారు. అక్కడ్నుంచి గద్దెపైకి తీసుకొచ్చారు. సమ్మక్కను తీసు కొచ్చే సందర్భంలో జనం పెద్దఎత్తున తోపులాట జరిగినా పోలీసులు చెదరగొట్టి చక్కదిద్దారు. సమక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై చేరుకోవడంతో శుక్రవారం మొక్కులు చెల్లించుకోనున్నారు.

## స్పైస్ బోర్డు తరలింపు అడ్డుకుంటాం

- **పరిశోధనా కేంద్రం నెలకొల్పాలి: చాంబర్ ఆఫ్ కామర్స్**

**నవతెలంగాణ-కాశీబుగ్గ**

వరంగల్‌లో ఉన్న స్పైస్ బోర్డును నిజామాబాద్‌కు తరలిస్తారనే వార్తలు వస్తున్నాయనీ, దీనిని అడ్డుకుంటామనీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దిడ్డి కుమారస్వామి అన్నారు. స్పైస్ బోర్డు రీజనల్ కార్యాలయానికి తోడు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. గురువారం వరంగల్ అర్బన్ జిల్లాలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రం నుండే 58శాతం మిర్చి పంట ఉత్పత్తి అవుతున్నట్టు తెలిపారు. 2009 నాటి పార్లమెంటు సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చొరవతో హైదరాబాద్‌లో ఉన్న స్పైస్ బోర్డ్ రీజనల్ కార్యాలయాన్ని వరంగల్‌కు తీసుకొచ్చినట్టు తెలిపారు. గతంలో కూడా స్పైస్ బోర్డును నిజామాబాద్‌కు తరలిస్తున్నట్టు వచ్చిన వార్తలపై వెంటనే స్పందించి నాటి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా వరంగల్‌లోనే ఉంచుతున్నట్టు హామీనిచ్చారని గుర్తుచేశారు.

## జమ్మూ మాజీ సీఎంలపై పీఎస్‌యూ కేసులు

**శ్రీనగర్:** ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజన నేపథ్యంలో జమ్మూకాశ్మీర్‌లో ఆంక్షలకు తోడూ.. రాజకీయ నాయకులందరినీ అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారు. వారందరినీ శ్రీనగర్‌లోని ఎమ్మెల్యే హాస్టల్లో ఉంచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అక్కడి నుంచి విడుదల చేసిన పలువురి నాయకులతో పాటు, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులైన ఒమర్ అబ్దుల్లా, మెహబుబా ముఫ్తీలను పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ (పీఎస్‌యూ) కింద కేసులు నమోదు చేసి వారిని నిర్బంధంలోకి తీసుకున్నట్టు అధికారిక సమాచారం. వీరితో పాటు గురువారం విడుదలైన నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్లు, మాజీ మంత్రులైన అలీ మహ్మద్ సాగర్, బషీర్ అహ్మద్ వీరీ, సర్తాజ్ మదానీలపై సైతం పీఎస్‌యూ కింద కేసులు నమోదుచేసి, నిర్బంధంలోకి తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

## సైకోకు ఉరిశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

జీవిత ఖైదు పడింది. ముగ్గురు బాలికలను కామాంధుడైన శ్రీనివాస్‌రెడ్డి లైంగికదాడి చేసి హత్య చేసినట్టు కోర్టు నిర్ధారించింది. ఈ మూడు హత్యలకు సంబంధించి కోర్టు వేర్వేరుగా తీర్పు వెలువరించింది. శ్రావణి, కల్పన కేసులలో ఉరిశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా, మనీషా కేసులో జీవిత ఖైదుతో పాటు రూ.2600 జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా మొదటి అదనపు జడ్జి, పోక్సో కోర్టు న్యాయమూర్తి వీవీ నాథ్‌రెడ్డి సంచలన తీర్పు చెప్పారు. కేసును అత్యంత అరుదైనదిగా భావిస్తూ నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసినట్టు పేర్కొన్నారు. ఈ మూడు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు.

**ఏమైనా చెప్పుకోవాల్సి ఉందా?**

అంతకు ముందు ఈ కేసు గురించి జడ్జి నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించారు. చేసిన నేరం రుజువైందని న్యాయమూర్తి అతడికి చెప్పారు. ఏమైనా చెప్పుకోవాల్సింది ఉందా అని అడిగారు. అయితే, తాను ఏ తప్పు చేయలేదనీ, కొందరు పోలీసులు కావాలనే ఇరికించారంటూ ఆరోపించాడు. పోలీసులు చిత్రహింసలు పెట్టి నేరం మోపింద్రని చెప్పాడు. తన రెండెకరాల భూమిని కాజేసేందుకు ఈ కేసుల్లో ఇరికించిన కొందరు తన మీద కోపంతో ఇల్లు కూల్చేశారనీ, తన అన్న వదినను కూడా గ్రామం నుంచి వెళ్లగొట్టారనీ జడ్జికి వివరించాడు. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత తనమీదే ఉందన్నాడు. జడ్జి జోక్యం చేసుకుని మీ తల్లిదండ్రులు ఎక్కడ ఉంటున్నారో తెలుసా అని ప్రశ్నించగా తెలియదని సమాధానమిచ్చాడు. నేరం రుజువైందని శిక్ష గురించి ఏమైనా చెప్పుకొంటావా అని జడ్జి ప్రశ్నించగా.. ఈ విషయం తనకు తెలియదంటూ కోర్టులో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

ఈ కేసులో గత నెల 17న వాదనలు ముగియగా.. గత నెల 27వ తేదీకి తీర్పును వాయిదా వేశారు. జడ్జిమెంట్ సిద్ధం కాకపోవడంతో పాటు మరికొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఫిబ్రవరి 6కు వాయిదా పడింది. గతేడాది జూలై 31న నల్లగొండలోని పోక్సో స్పెషల్ కోర్టులో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. అక్టోబర్ 14 నుంచి కోర్టు 55 పనిదినాల్లో విచారణ పూర్తిచేసింది. మొత్తం 300 మంది సాక్షులను పోలీసులు విచారించారు. 101 మంది సాక్షుల వాంగ్మూలాలను పోలీసులు తమ చార్జిషీట్‌లో పొందుపరిచారు. 90 రోజుల్లోనే కేసు విచారణను పూర్తిచేశారు. నిందితుడిపై మూడు కేసులు నమోదు చేయడంతో కోర్టు కూడా వేర్వేరుగా విచారణ జరిపింది. ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు ప్రత్యేకంగా హైదరాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కె.చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. ముగ్గురు బాలికల హత్య కేసులనూ దశలవారీగా విచారించిన న్యాయస్థానం అన్ని కోణాలనూ పరిశీలించింది. ఫోరెన్సిక్ రిపోర్ట్స్‌తో పాటు సైంటిఫిక్, సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు వాటిని సాక్ష్యాధారాల కింద పోక్సో కోర్టుకు అందచేశారు. ఫోరెన్సిక్ నివేదికలు కేసులో కీలకంగా నిలిచాయి. ఆ తర్వాత నమోదైన సాక్ష్యాలపై సెక్షన్ 113 కింద నిందితుని అభిప్రాయాన్ని కోర్టు తీసుకుంది. ఇరుపక్షాల వాదనలు పూర్తవ్వడంతో నేరం నిరూపణ అయ్యింది. కోర్టు దోషికి ఉరిశిక్ష విధించింది.

**నల్లగొండలో ఇది మూడో తీర్పు**

నల్లగొండ చరిత్రలో ఓ కేసు ఇంత త్వరగా విచారణ జరిపి తీర్పు చెప్పడం చారిత్రాత్మకం అని న్యాయవాదులు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగిందని ఓ న్యాయవాది చెప్పారు. పై కోర్టులకు వెళ్లినా ఈ తీర్పును అనుసరించే విచారణ ఉంటుందన్నారు. నల్లగొండలో గతంలో రెండు కేసుల్లో మరణశిక్షలు విధించారు. ఇది మూడో కేసు. హాజీపూర్ కేసుల్లో ఈ తీర్పును చూసి నేరస్తులు భయపడతారని మహిళ న్యాయవాదులు ఆకాంక్షించారు.

**శ్రావణి మిస్సింగ్‌తో వెలుగుచూసిన దారుణాలు**

బైక్‌పై లిఫ్టు ఇస్తాననే పేరుతో ముగ్గురు మైనర్ బాలికలను బైక్‌పై ఎక్కించుకొని తన వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి లైంగికదాడి, ఆపై హత్య చేసి బావిలో పూడ్చిపెట్టాడు. అదేగ్రామానికి చెందిన శ్రావణి, మనీషా, మైసిరెడ్డిపల్లికి చెందిన కల్పనలను చంపినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. గత ఏడాది ఏప్రిల్ 25న శ్రావణి కనిపించడం లేదంటూ వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కదిలారు. 26న కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయబావి వద్ద ఆ బాలికకు చెందిన స్కూల్ బ్యాగ్‌ను గ్రామస్థులు గుర్తించడంతో దారుణాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో కూడా మిస్సయిన మనీషా, మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుంగని కల్పనను కూడా ఇదే తరహాలో చంపినట్టు గుర్తించారు. అతనిచ్చిన సమాచారంతో బావిలో తవ్వకాలు జరపగా ఇద్దరు బాలికల అస్థికలను స్వాధీనం చేసుకున్నారు. వీటికి ముందు కర్నూల్‌లో ఓ మహిళను కూడా హత్య చేసినట్టు వెల్లడైంది.

## సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందు లో ముగ్గురు డీఐజీలకు ఐజీలుగా, ఆరుగురు ఎస్పీలకు డీఐజీలుగా పదోన్నతు లిచ్చారు. ఐజీలుగా పదోన్నతులు పొందిన వారిలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ డీఐజీ రాజేష్‌కుమార్, నిజామా బాద్ రేంజ్ డీఐజీ శివశంకర్‌రెడ్డి, వరంగల్ నగర కమిషనర్ డాక్టర్ వి.రవీందర్‌లు ఉన్నారు. డీఐజీలుగా పదోన్నతులు లభించిన వారిలో ఉమెన్స్ ప్రొటెక్షన్ వింగ్ ఎస్పీ సుమతి, నిజామా బాద్ నగర కమిషనర్ కార్తికేయ, మాదాపూర్ డీసీపీ ఎ.వెంకటేశ్వరరావు, ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమీ జాయింట్ డైరెక్టర్ రమేష్‌నాయుడు, సీఐడీ ఎస్పీ ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీసు కమిషనర్ సత్యనారాయణలు ఉన్నారు. కాగా ఈ అధికారులందరికి త్వరలోనే కొత్తగా పోస్టింగ్‌లు లభించనున్నాయని తెలిసింది. వీరితో పాటు కొందరు అదనపు డీజీలు మొదలుకుని ఎస్పీ స్థాయి అధికారుల వరకు బదిలీలు జరపడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ముఖ్యంగా కొన్ని జిల్లాల ఎస్పీల పని తీరును వీక్షించిన డీజీపీ వారి బదిలీల కోసం సిఫారసు చేసినట్టు గెలిసింది. మరో పక్క కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం తాము కోరుకున్న ఎస్పీలకు, అదనపు ఎస్పీలకు తమ జిల్లాల ఎస్పీలుగా నియామకం జరిగేలా తెర వెనుక ప్రయత్నాలు ముమ్మరం చేశారని సమాచారం. ఈ విషయమై సీఎం కేసీఆర్ , మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద వీరు రాయబారాలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ కారణం వల్లనే గత వారంలో జరగాల్సిన ఐపీఎస్ అధికారుల బదిలీలలో జాప్యమవుతున్నట్టు తెలిసింది.

రక్ష
నవతెలంగాణ

పరిశోధన




## రక్షించే పీచు!

ఏ వయసులో ఎలాంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది అన్న విషయంపై ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ఐదు పదులు దాటిన తరువాత తీసుకునే ఆహారంలో కచ్చితంగా పీచు ఉండాలి అంటున్నారు ఆస్ట్రేలియా యూనివర్శిటీ పరిశోధకులు. యాభై నుంచి డెబ్బై ఏండ్ల మధ్య వయసు గల దాదాపు 1500 మంది మీద నిర్వహించిన అధ్యయనం ఫలితాలను వారు వెల్లడించారు. చాలాకాలం పాటు వీరిలో కొందరికి మామూలు ఆహారం అందించారు. మిగతా వారికి పీచు అధికంగా కలిగిన ఆహారాన్ని అందించారు. కొన్ని నెలల తర్వాత వీరి ఆరోగ్యాన్ని పరిశీలించగా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకున్న వారిలో ఎక్కువమంది గతం కన్నా మరింత ఆరోగ్యంగా ఉన్నారు. పీచు తీసుకోని వారిలో రకరకాల ఆరోగ్య సమస్యలు వీరి ద ష్టికి వచ్చాయి. అవన్నీ సాధారణంగా వయస్సురీత్యా వచ్చే సమస్యలే అయినా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వలన వాటి బారి నుంచి చాలా వరకూ తప్పించుకోవచ్చు అని పరిశోధకులు సూచిస్తున్నారు.

## విటమిన్ 'ఇ' సమృద్ధిగా..!




పని భారం అధికంగా ఉన్నప్పుడు సహజంగా శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతారు. ఒత్తిడికి గురికావటం వల్ల పని పట్ల ఏకాగ్రత క్రమంగా తగ్గుతుంది. పని చేస్తున్న సమయంలో ఏకాగ్రత తగ్గకుండా ఉండాలంటే ఆహారంలో కొన్ని నియమాలు పాటిస్తే సరిపోతుంది.

పని చేసే సమయంలో నరాలు ఒత్తిడికి గురి కాకుండా ఉండాలంటే ఉడకబెట్టిన గుడ్డును తింటే సరిపోతుంది. ఇది తినటం వల్ల మెదడులోని నరాల పని విధానం సక్రమంగా జరుగుతుంది. గుడ్డులో ఉండే పోషకాలు ఏకాగ్రతను పెంచుతాయి. అలాగే గుడ్డు సంతోషాన్ని కల్గించే కొన్ని హార్మోన్లను విడుదల చేస్తుంది. ఆనందంగా ఉంచటంతో పాటు ఏకాగ్రతను పెంచుతుంది.

ఆఫీస్‌కు వెళ్ళేటప్పుడు ఒక చిన్న బాక్స్‌లో కొన్ని చిరు ధాన్యాలను, గింజలను వేసుకుని పోవటం మంచిది. ఇవి శారీరకంగా అన్ని సమస్యలను దూరం చేస్తాయి. అలాగే వీటిలో ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజలవణాలు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్ 'ఇ' సమృద్ధిగా ఉంటాయి.



# రోబోటిక్-అసిస్టెడ్ జాయింట్ రీప్లేస్ మెంటు

**వైద్య రంగంలో అనేక కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. సర్జరీ చరిత్రలో సరికొత్త అధ్యాయనం చోటు చేసుకుంది. జాయింట్ రీప్లేస్మెంట్‌కు దేశంలోనే తొలిసారి "నాల్గవ తరం" రోబో అందుబాటులోకి వచ్చింది. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలో నూతన ఒరవడికి సన్ షైన్ హాస్పిటల్ శ్రీకారం చుట్టింది.**

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పోషకాల లోపం వల్ల కీళ్ళ అరుగుదల సమస్య అధికమవుతుంది. గతంలో వయసు పెరిగిన వారిలో ఆర్థరైటిస్ ఎక్కువగా కనిపించేది. కానీ, ఇటీవల యువతలో కూడా దీని ప్రభావం ఉంటుంది.

**కారణాలు..**

అధిక బరువు, నేలపై కూర్చొవడం, మెట్లు ఎక్కడం, సరైన పోషకాలు తీసుకోకపోవడం కీళ్ళనొప్పులకు కారణం అవుతోంది. మోకీలు పై ఒత్తిడి పెరిగి తొందరగా అరుగుతుంది.ఇలాంటి సమయంలో మోకీలు మార్పిడి అవసరం అవుతోంది. మోకీలు అరుగుదల నాల్గో దశకు చేరినపుడే మాత్రమే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది.

**తక్కువ కోతతో**

రోబోటిక్-అసిస్టెడ్ జాయింట్ రీప్లేస్ మెంటు అనేది కొత్తగా వచ్చిన శస్త్రచికిత్స విధానం. ఇందులో 'నాల్గవ తరం' రోబో సహాయంతో మోకాలి చిప్ప, తుంటి ఎముకల అరిగిన బాగాన్ని ఖచ్చితంగా అంచనావేసి కంప్యూటర్ నావిగేషన్ సహాయంతో సరైన పరిణామం నిర్ధారించుకుని, శస్త్రచికిత్స సమయంలో ఒక అంగుళం కూడా తేడా రాకుండా నిర్వహించి ఇంప్లాటను అమర్చడం వీలవుతోంది. దీని ద్వారా రోగికి మెరుగైన ఫలితాలతో పాటు, అతి తక్కువ రక్తస్రావం, త్వరగా కోల్కోవడం, హాస్పిటల్ నుండి అతి తక్కువ సమయంలో డిస్చార్జ్ వంటి అనేక సత్ఫలితాలు ఉంటాయి.

ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య ప్రతి సంవత్సరం దాదాపు పదిహేను శాతం పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తుంది. అందుబాటులోకి వచ్చిన ఈ సరికొత్త విధానం ద్వారా రోగికి మెరుగైన ఫలితాలు ఉంటాయి.



**- డాక్టర్ గురవారెడ్డి**
**ఆర్థోపెడిక్ విభాగాదిపతి**
**సన్ షైన్ ,హైదరాబాద్**

## ఈ లక్షణాలు బాధిస్తుంటే..!




కొన్ని చిన్నచిన్న సమస్యలుగా కనిపించిన అంశాలు నిర్లక్ష్యం చేయడం వల్ల పెద్ద సమస్యగా మారుతాయి. వాటిలో కొన్ని పేర్లు మరచిపోవడం, వెళ్ళవలసిన సమయం మర్చిపోవడం, దారి మర్చిపోవడం, వస్తువులు గుర్తుపెట్టుకోలేకపోవడం వంటి సమస్యలుంటాయి.

- ✧ పరిచయస్తులు ఎదురుగా ఉన్నప్పటికీ, వారిని గుర్తుపట్టలేకపోవడం.
- ✧ బద్దకంగా మారిపోయి, ఆధారపడే ధోరణికి అలవాటు పడటం వలన వంట చేయడం, బండి నడపడం, ఇంటిపనులు చేయడం కష్టమౌతుంది.
- ✧ ప్రస్తుత సమయం, తేదీ, రోజులను మర్చిపోవడమేకాక, బాగా పరిచితమైన వ్యక్తులను, స్థలాలనూ గుర్తుపట్టకపోవచ్చు. తన ఇంటి చిరునామా మర్చిపోవచ్చు.
- ✧ మాట్లాడేటప్పుడు భాషను సరిగ్గా ఉపయోగించలేకపోవచ్చు, పదాలు సరిగ్గా చెప్పలేకపోవచ్చు లేదా మాట్లాడిన, రాసిన పదాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు.
- ✧ కారణం లేకుండానే మితిమీరిన కోపం, ఆత్రుత లేదా అనుమానాస్పదంగా మారవచ్చు. అందరిలో కలిసే మనస్తత్వం ఉన్నప్పటికీ, ముడుచుకు పోయి, దూరంగా, నిశ్శబ్దంగా ఉండటం.
- ✧ ఐదు నిముషాల ముందు జరిగిన విషయాలు కూడా మరిచిపోతారు. రానురాను ఒకటి రెండు రోజుల ముందు విషయాలూ మరిచిపోతారు. పాత విషయాలు మాత్రం చివరి వరకూ గుర్తుంటాయి.
- ✧ ఇలాంటి సమస్యలు పెద్దవారిలో ఉంటే అల్జీమర్స్‌గా గుర్తించి తగిన చికిత్స ఇవ్వాలి. చిన్నవారిలో ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

## కీళ్ళలో నొప్పిగా ఉంటే..!



నడుస్తున్నప్పుడో, మెట్లు ఎక్కుతున్నప్పుడో కీళ్లల్లో కాస్త నొప్పి అనిపించడం సాధారణే. కానీ, తరుచుగా కీళ్లల్లో నొప్పి అనిపిస్తుంటే మాత్రం జాగ్రత్త తీసుకోవల్సిందే.ముఖ్యంగా వాకింగ్ జాగింగ్‌లు చేసేవాళ్ళు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కాలు, పిక్క కండరాలు గట్టిపడే స్క్వాట్, బ్రిడ్జెస్, హిప్ స్టెబిలిటీ వ్యాయామాల్ని రోజూ క్రమం తప్పకుండా చేయాలి. అనుకున్న రన్నింగ్, జాగింగ్ చేయడానికి 6 నుంచి 8 వారాల దాకా చేసి ఆ తర్వాతే రన్నింగ్ గానీ, జాగింగ్ గానీ చేయాలి. అలా ఏమీ చేయకుండా సరాసరిగా రన్నింగ్‌లు, జాగింగ్‌లు చేస్తే, కలిగే లాభం మాట అటుంచి, మోకాలు కీలు మరింత దెబ్బ తినే ప్రమాదం ఉంది.

ఇతర వ్యాయామాలన్నీ చేశాక కూడా నడుస్తున్నప్పుడు నొప్పి అనిపిస్తే, కొద్ది రోజుల పాటు విరామం తీసుకోవాలి. ఐస్ గడ్డను గుడ్డలో చుట్టి నొప్పి ఉన్న భాగాల్లో ఉంచి అటూ ఇటూ తిప్పాలి. నొప్పి తగ్గగానే మళ్లీ వ్యాయామాన్ని కొనసాగించవచ్చు. ఇలా తగ్గిన నొప్పి అంతటితో పూర్తిగా పోతే సరే సరి! ఒకవేళ కొద్ది రోజుల తర్వాత నొప్పి మళ్లీ వస్తే, వెంటనే ఫిజియో థెరపిస్టను, ఆర్థోపెడిక్ డాక్టర్‌ను, సంప్రదించాలి.

బిజినెస్

| సెన్సెక్స్ ▲164 | నిఫ్టీ ▲ 48 | డాలరుకు రూపాయి విలువ | బంగారం(10.గ్రా) | వెండి (కేజీ) |
|---|---|---|---|---|
| 41,306 | 12,137 | 71.11 | రూ. 40,355 | రూ. 46,149 |





### ప్రతి పట్టణానికి శానిటేషన్, హెల్త్ ప్లాన్లు : మంత్రి కేటీఆర్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రజలే కేంద్రంగా పురపాలన కొనసాగాలని పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. ప్రతి పట్టణానికి శానిటేషన్, గ్రీన్, హెల్త్ ప్లాన్లు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైతే వెటర్నరీ డాక్టర్లు, ఎంటమాలజిస్టులతోపాటు ఇతర సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. నగరంలో గురువారం ఆయన కార్పొరేషన్లు, మున్సిపాల్టీల కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో సమావేశమయ్యారు. పౌర సేవలు అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా, వేగంగా అందాలన్న లక్ష్యంతో పలు నూతన విధానాలను తీసుకురాబోతున్నట్టు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలతో మమేకం కావాలని సూచించారు. నూతన పురపాలక చట్టాన్ని ప్రతి ఒక్క మున్సిపల్ కమిషనర్ తన విధి నిర్వహణలో జాబ్ చార్ట్‌గా పరిగణించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఉదయం నాలుగున్నర గంటలకే పట్టణ పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు.

### రేపు టీసీఏ ప్రేరణ : పాపిరెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ కామర్స్ అసోసియేషన్ (టీసీఏ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని బద్రుకా కాలేజీలో ప్రేరణ కార్యక్రమం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ మాట్లాడుతూ టీసీఏ ఆధ్వర్యంలో జిల్లాల్లోనూ కామర్స్ విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించారు. టీసీఏ అధ్యక్షులు హెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 8న బద్రుకా కాలేజీలో బిజినెస్ క్విజ్, కామర్స్ క్వెస్ట, జస్ట్ ఎ మినిట్, వ్యాసరచన, వక్తృత్వం వంటి అంశాలపై కామర్స్ విద్యార్థులతో ప్రేరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీసీఏ కార్యదర్శి డి చెన్నప్ప, బద్రుకా కాలేజీ ప్రిన్సిపాల్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నెలాఖరు నుంచి నిమిషాల్లోనే పాన్‌కార్డ్



**న్యూఢిల్లీ:** దేశంలో పన్ను ఆదాయం పెంపుపై దృష్టి సారించిన ప్రభుత్వం ఇందుకు గాను ప్రజల నుంచి వీలైనంత ఎక్కువ సమాచారాన్ని సమీకరించాలని చూస్తోంది. ఈ క్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా సత్వరం 'ఈ పాన్ కార్డు' పొందే విధానాన్ని ఈ నెల నుంచి అందుబాటులోకి తేనుంది. ఈ కొత్త విధానం అమలు గురించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్టుగా రెవెన్యూ శాఖ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే గురువారం వెల్లడించారు. ఆధార్ వివరాలు సమర్పించడం ద్వారా ఆన్‌లైన్‌లో సత్వరం పాన్‌కార్డు పొందేందుకు కొత్త విధానాన్ని తీసుకురావాలని కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు అనుగుణంగానే ఈ నెలాఖరు నుంచే కొత్త విధానాన్ని తీసుకురానున్నట్టు ఆయన తెలిపారు.

### బ్యాంకుల విలీనాలతో భారీ సవాళ్లు..



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాల వల్ల రానున్న రోజుల్లో భారీ సవాళ్లు ఎదురు కానున్నాయని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మెన్ రజనీశ్ కుమార్ అభిప్రాయ పడ్డారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలీన ప్రక్రియలో ఇన్ఫర్మేషన్ టెక్నలాజీ సమీకృతాన్ని చాలా జాగ్రత్తగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ఆర్బీఐ మాటా..'యథాతథం'!

## దేశంలో మందగమనాన్ని పట్టించుకోని ఎంపీసీ పెద్దలు

- వడ్డీరేట్ల సవరణకు కమిటీ వెనుకంజ..!
- పెరిగిపోతున్న ధరలపై తీవ్ర ఆందోళన
- చిన్న వడ్డీరేట్లు తగ్గించాలంటూ సూచన




**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమన పరిస్థితులను కేంద్రంలోని మోడీ సర్కారు చాలా తేలికగా తీసుకుంటోంది. భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర విపత్కర పరిస్థితుల్లోకి జారుకుంటోందని.. సర్కారు దీనిని సీరియస్‌గా తీసుకొని తగిన చర్యలు చేపట్టాలంటూ రేటింగ్ సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నా సర్కారు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే, కేంద్ర బడ్జెట్‌లలో మందగమనాన్ని నియంత్రించేలా ఎలాంటి చర్యలూ కనిపించని సంగతి తెలిసిందే. తాజాగా భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) ద్రవ్యపరపతి విధాన సమీక్షా కమిటీ (ఎంపీసీ) కూడా దేశంలోని మందగమన పరిస్థితులను చాలా లైట్ తీసుకుంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చివరి, ఆరో ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్ష కమిటీ సమావేశం గురువారంతో ముగిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ప్రస్తుతం అమలులో ఉన్న కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించామని ఆర్బీఐ తెలిపింది. రెపో రేటును యథాతథంగా 5.15 శాతంగాను, రివర్స్ రెపో రేటును 4.90 శాతం వద్దే ఉంచాలని నిర్ణయించారు. వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచాలనే అంశంపై మానిటరీ పాలసీ కమిటీ 6-0 ఓట్లతో ఏకగ్రీవ నిర్ణయం తీసుకుందని ఆర్బీఐ తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి ఆరు శాతంగా ఉండొచ్చని ఎంపీసీ అంచనా కట్టింది. 2020-21 బడ్జెట్ తర్వాత జరిగిన తొలి సమీక్ష ఇదే కావడం గమనార్హం.

### దేశంలో ధరల మోత..

దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోతున్న అంశాన్ని ఆర్బీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో 2019-20 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.5 శాతంగా నమోదు కావొచ్చని ఆర్బీఐ ఎంపీసీ కమిటీ అంచనాకు వచ్చింది. 2020-21 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ఇది 5.4-5శాతంగా నమోదు అవుతుందని అంచనా కట్టింది. గత డిసెంబరులో కూరగాయల ధరలు బాగా పెరగడంతో పాటు రిటైల్ ద్రవ్యోల్బణం ఐదేండ్ల గరిష్ఠానికి చేరడంతో రేట్ల కోతకు ఆర్‌బీఐ మొగ్గు చూపలేదని తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి జూన్ వరకు ఎలాంటి రేట్లకోత ఉండకపోవచ్చని సమాచారం. 2019లో ఆర్‌బీఐ మొత్తంగా 135 బేసిస్ పాయింట్ల మేర కీలక రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ తగ్గింపునకు సంబంధించిన ఫలాలు కింది స్థాయికి అందేలా వాణిజ్య బ్యాంకుల చర్యలు చేపట్టకపోవడం కూడా ఆర్బీఐ వడ్డీరేట్లను మరింతగా తగ్గించకుండా అడ్డుకుందని విశ్లేషకులు చెబుతున్నారు. తదుపరి ఎంపీసీ సమీక్ష మార్చి 31, ఏప్రిల్ 1, 3వ తేదీల్లో జరగనుంది. ఈ ఏడాది సెప్టెంబరు వరకు దేశంలోని ప్రజలకు ధరల పోటు తప్పని పరిస్థితి కనిపిస్తోందని ఆర్బీఐ ఎంపీసీ అభిప్రాయపడింది. ఆహార ధాన్యాలు, పప్పులు, మాంసకృత్తులు కలిగిన ఆహార పదార్థాలు ఇంధనపు ధరలు పెరుగుతుండడం కొంత ఆందోళనకరమేనన్న భావన ఎంపీసీలో వ్యక్తమైనట్టుగా సమాచారం. దీనికి తోడు మొబైల్ ఫోన్ చార్జీలు, ఔషధాల ధరలు, రానున్న రోజుల్లో కొత్తగా అమలులోకి రానున్న సరికొత్త ఉద్గార నిబంధనలు కూడా ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఎంపీసీ సభ్యులు ఒక అభిప్రాయానికి వచ్చినట్టుగా తెలుస్తోంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలం వరకు కూడా ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించలేని పరిస్థితులు కనిపిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

### చిన్న మొత్తాలపై వడ్డీరేట్ల తగ్గింపు..

పేద, మధ్య తరగతి ప్రజలు సొమ్ములు దాచుకొనే వివిధ చిన్నమొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్బీఐ ఎంపీసీ సర్కారుకు సూచించింది. బ్యాంకులతో సహా ఇతర విత్త సంస్థలు వడ్డీరేట్లను తగ్గించిన నేపథ్యంలో ఆ మేరకు చిన్నమొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను కుదించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీసీ సూచించింది. ఇలా చేయకుంటే పొదుపు విధానంలో తారతమ్యత చోటు చేసుకోవచ్చని తెలిపింది. ఎక్కువ మొత్తంలో వడ్డీ ఉన్న నేపథ్యంలో డిపాజిట్లు ఎక్కువ మొత్తం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ) వంటి ఇతర మార్గాల వైపు పయనించే అవకాశం ఉందని ఎంపీసీ అభిప్రాయపడింది. ప్రస్తుత త్రైమాసికానికి సంబంధించి చిన్నమొత్తాల పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వ వడ్డీరేట్ల తగ్గింపును ప్రకటించలేదు.. ఈ నేపథ్యంలో ఎంపీసీ తన పరపతి విధాన సమీక్షలో ఈ విషయాన్ని ప్రధానంగా చర్చకు తీసుకపోవడం విశేషం.

### పలు అవకాశాలు అందుబాటులో..

దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను చక్కదిద్దేందుకు గాను పలు విధాన పరమైన నిర్ణయాలు తీసుకొనేందుకు గాను ఇంకా అవకాశాలు మిగిలే ఉన్నాయని ఆర్బీఐ ఎంపీసీ అభిప్రాయపడింది. ఇటీవలి కాలంలో కొన్ని రంగాలలో పరిస్థితి మెరుగువుతున్న సంకేతాలు అందుతున్నాయని.. ఈ నేపథ్యంలో పరిస్థితులను పూర్తిస్థాయిలో సమీక్షించుకొంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యల్బోణం పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతానికి యథాతథ స్థితిని కొనసాగించడమే ఉత్తమంగా భావిస్తున్నామంటూ ఎంపీసీ కమిటీ సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### కరోనా వైరస్ కలవరమే..



**ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విజృంభిస్తున్న కరోనా వైరస్ వాప్తి రానున్న రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థకు క(న)ష్ట కాలమే ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ ఎంపీసీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది.**

**కరోనా వైరస్ ఇప్పటికే దాదాపు 560 మందిని పొట్టనబెట్టుకున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆర్బీఐ కమిటీ అభిప్రాయపడింది. ఇలాంటి విపత్తును ఎదుర్కొనేందుకు గాను విస్తృతమైన కంటింజెన్సీ ప్రణాళిక అవసరం ఎంతైనా ఉందని కమిటీ తెలిపింది. వైరస్ వ్యాప్తి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో దీని ప్రభావం దేశీయ ఎగుమతి, దిగుమతులపై కనిపించే అవకాశం ఉందని. పర్యటక రంగం ఆదాయానికి కూడా తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది. విదేశీయుల రాక తగ్గిపోవచ్చని, ట్రేడ్ ఆదాయం గణనీయంగా పడిపోవచ్చని ఎంపీసీ అంచనాకు వచ్చింది. ఫలితంగా దీని ప్రభావం వృద్ధిరేటుపై ప్రతిబింబించే అవకాశం కనిపిస్తోందని తెలిపింది. దీనిని సమర్థంగా ఎదుర్కొనేందుకు గాను సర్కారు నిర్మాణాత్మక చర్యలతో ముందుకు రావాలని ఆర్బీఐ సూచించింది.**

epaper.navatelangana.com

# నవచిత్రం

## తొలిసారి డబుల్ రోల్..!


మహేష్‌బాబు

మహేష్‌బాబు ఒక్కడిని తెరపై చూస్తేనే అభిమానులు ఊగిపోతారు. అలాంటిది ఇద్దరు మహేష్‌లను చూస్తే డెఫినెట్‌గా ఓ పండగనే చెప్పాలి. ఊహించుకోవడానికే ఇలా ఉంటే, అదే నిజమైతే అద్భుతమని చెప్పొచ్చు. అన్నీ కుదిరితే త్వరలోనే ఇది నిజం కాబోతుందని తెలుస్తుంది. మహేష్‌బాబు హీరోగా వంశీపైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ సమ్మర్‌లో ఇది ప్రారంభం కానుంది. గ్యాంగ్‌స్టర్ ప్రధానంగా రజనీకాంత్ 'బాషా' చిత్రం తరహాలో ఈ సినిమా ఉంటుందని తెలుస్తోంది. ఇందులో మహేష్‌బాబు ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు, అందులో ఓ పాత్రలో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నట్టు తెలుస్తుంది. ఫ్లాష్‌బ్యాక్‌తో పాటు ప్రస్తుతంలోనూ కనిపిస్తారట. మరి ఇందులో నిజమెంతా అనేది పక్కన పెడితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త హల్‌చల్ చేస్తుంది. కైరా అద్వానీ కథానాయికగా నటించే అవకాశం ఉందట. వంశీపైడిపల్లితో మహేష్ గతేడాది 'మహర్షి' చిత్రం చేశారు. ఇది బాక్సాఫీసు దగ్గర మంచి వసూళ్ళని రాబట్టింది. అంతేకాకుండా మహేష్ కెరీర్‌లో చెప్పుకోదగ్గ సినిమాగానూ నిలిచింది.

## నీలి నీలి ఆకాశం పాటకు విశేష శ్రోతకాదరణ


అమృతా అయ్యర్, ప్రదీప్

యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయం అవుతూ '30 రోజుల్లో ప్రేమించటం ఎలా?' చిత్రంలో నటిస్తున్నారు. మున్నా దర్శకత్వంలో ఎస్వీ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్వీ బాబు నిర్మిస్తున్నారు. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తుంది. అనూప్ రూబెన్స్ స్వరాలు అందించగా, చంద్రబోస్ సాహిత్యం సమకూర్చిన ఈ చిత్రంలోని 'నీలి నీలి ఆకాశం' పాట అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ పాట విజయోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ, 'మా అందరి ముఖాల్లో నవ్వు కనిపిస్తుండటానికి కారణం ఒక మంచి సినిమా చేశామనే నమ్మకం. తెలుగు ప్రేక్షకులెప్పుడూ మంచి సినిమాల్ని ఆదరిస్తారనేది మా నమ్మకం. ఒక బేబీలాగా దర్శకుడు ఈ కథను పెంచి, అద్భుతంగా తెరకెక్కించి మన ముందుకు తీసుకొచ్చారు. నిర్మాత ఎస్వీబాబు ఓ ఇంటిపెద్ద లాగా, ఒక తండ్రిలాగా మమ్మల్ని ముందుకు నడిపించారు. సినిమాలో ప్రతి పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ ఇచ్చిన సినిమాల్లో 'మనం' నా ఆల్ టైం ఫేవరేట్. అలాంటి అనూప్ నా ఫస్ట్ సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ కావడం నేను ఊహించలేదు.

లెజెండరీ లిరిసిస్ట్ చంద్రబోస్ 'నీలి నీలి ఆకాశం' పాటను రాసిన విధానం అద్భుతం. అది ఆయన పెన్నులోని మ్యాజిక్ కాదు, ఆయన మనసులోని మ్యాజిక్. ఆ పాటను సిద్ శ్రీరామ్, సునీత అద్భుతంగా పాడారు. ఇది అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ని లాంచ్ చేసిన రానా అన్నకు థ్యాంక్స్. ఈ సాంగ్ వీడియో చూసి, అద్భుతంగా ఉందని మెచ్చుకొని, తన ట్విట్టర్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో లాంచ్ చేసిన మా సూపర్ స్టార్ మహేష్‌కి స్పెషల్ థ్యాంక్స్. ఇంతకంటే బిగ్గెస్ట్ లాంచ్ నా లైఫ్‌లో మళ్లీ రాదనుకుంటా. ఆయన లాంచ్ చేయడం వల్ల ప్రపంచంలోని తెలుగువాళ్లందరి దగ్గరకు ఈ సాంగ్ వెళ్లింది' అని అన్నారు. "నీలి నీలి ఆకాశం' పాటకు ఇంతమంచి రెస్పాన్స్ రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పాటను పల్లెటూళ్ల దగ్గర్నుంచి సోషల్ మీడియా దాకా అందరూ పాడుతున్నారు. ఈ సినిమాని మ్యూజికల్‌గా చెప్పాలని అనుకున్నప్పుడు అనూప్ రూబెన్స్ తప్ప నాకు ఇంకో ఆప్షన్ కనిపించలేదు. రీరికార్డింగ్‌తో ఈ సినిమా చూసినరోజు నా మనసంతా బరువెక్కిపోయింది. అంత గొప్ప మ్యూజిక్ ఇచ్చారు అనూప్. చంద్రబోస్ గొప్ప సాహిత్యం ఇచ్చారు. సమవుజ్జీలుగా ఉన్న సంగీత సాహిత్యాలకు తగ్గట్టు సిద్ శ్రీరామ్, సునీత తమ గాత్రాలతో పాటకు ప్రాణం పోశారు. ఆ పాటకు తెరపై ప్రదీప్, అమృత అభినయించిన తీరు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే' అని దర్శకుడు మున్నా చెప్పారు. నిర్మాత ఎస్వీ బాబు మాట్లాడుతూ, "నిజంగా ఇంత అద్భుతంగా ఈ సాంగ్ వస్తుందని నేను ఊహించలేదు. ప్రపంచంలోని తెలుగు ప్రజలందరూ ఈ పాటను ఇంత పెద్ద హిట్ చేసినందుకు ధన్యవాదాలు' అని చెప్పారు.

## కళాతపస్వి ఆవిష్కరించిన తెలంగాణ పోరడు పాట


కె.విశ్వనాథ్‌తో 'ఎస్‌డి కేరాఫ్ వెంచపల్లి' చిత్ర బృందం

శ్రీజిత్ లవన్, జీవా, సుమన్ శెట్టి, దివ్య, రాతేష్, అభిగ్యాన్, లక్కి, ఎస్.వింధ్యారెడ్డి ప్రధాన పాత్రధారులుగా పాలిక్ దర్శకత్వంలో శ్రీ సాయి అమృత లక్ష్మి క్రియేషన్స్, పాలిక్ స్టూడియోస్, భాను ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై గోదారి భానుచందర్ నిర్మిస్తున్న చిత్రం 'ఎస్‌డి కేరాఫ్ వెంచపల్లి'. రఘురామ్ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలోని ఫస్ట్ లిరికల్ సాంగ్‌ని కళాతపస్వి కె.విశ్వనాథ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "తెలంగాణ పోరడు' అనే పాట వినసొంపుగా ఉంది. నూతన తారాగణంతో దర్శకుడు పాలిక్ చేస్తున్న ఈ ప్రయత్నం ఫలించాలి' అని అన్నారు. "పట్టణాలు, పల్లెల్లో ఇటీవల మేం విడుదల చేసిన 'తెలంగాణ పోరడు' సాంగ్ మారుమోగుతోంది. గోదారమ్మ పరవళ్లు తొక్కినట్టుగా రఘురామ్ అందమైన బాణీ సమకూర్చగా దానికి సురేష్ గంగుల తెలంగాణ మట్టి పరిమళింపులాంటి చక్కటి సాహిత్యాన్ని సమకూర్చారు. ఇంత మంచి పాటని గురువుగారు కళాతపస్వి కె.విశ్వనాథ్‌గారి చేతుల మీదుగా లాంచ్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. స్వతహాగా నేను కొరియోగ్రాఫర్‌ని కావడంతో కె.విశ్వనాథ్‌గారి చిత్రాల్లోని పాటల నృత్యాలను ఎంతో మంది పిల్లలకు నేర్పించేవాణ్ని. ఇక నా మొదటి సినిమాలోని మొదటి పాటను వారు ఆవిష్కరించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా' అని దర్శకుడు పాలిక్ తెలిపారు. నిర్మాత గోదారి భానుచందర్ చెబుతూ, 'సంగీత దర్శకుడు రఘురామ్ నుంచి దర్శకుడు పాలిక్ మంచి బాణీని తీసుకొని దానికి సురేష్ గంగులతో అర్థవంతమైన సాహిత్యాన్ని రాయించారు. త్వరలో ఫైనల్ షెడ్యూల్‌ని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించనున్నాం. ఎన్నో ఆటంకాలు వచ్చినా వాటిని అధిగమించి దర్శకుడు చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు' అని అన్నారు. సంగీత దర్శకుడు రఘురామ్ మాట్లాడుతూ, 'కళాతపస్వి చేతుల మీదుగా నేను కంపోజ్ చేసిన సాంగ్ లాంచ్ చేయడం చాలా సంతోషం. సురేష్ గంగుల చక్కటి సాహిత్యాన్ని సమకూర్చగా అదితి భావరాజు తన గళంతో పాటకు ప్రాణం పోశారు. ఇది సోషల్ నెట్ వర్క్‌లో మంచి కామెంట్స్‌తో, వ్యూస్‌తో దూసుకెళ్తోంది' అని అన్నారు.

## సినిమా చూసి అభ్యంతరాలు చెప్పండి


ఏలేటి శ్రీనివాసరావు, నరసింహ నంది, బాపిరాజు

"1940లో ఓ గ్రామం' నుంచి ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలన్నీ ఓ సామాజిక అంశంతో, మంచి సందేశం ఇచ్చే చిత్రాలను సామాజిక బాధ్యతగా తీశాను. అందులో భాగంగా చేసిందే 'డిగ్రీ కాలేజ్'. దీనిపై కేసు పెట్టి వివాదం చేయడం కరెక్ట్ కాదు' అని దర్శకుడు నరసింహానంది అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'డిగ్రీ కాలేజ్' నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఇదిలా ఉంటే, ఇటీవల విడుదల చేసిన పోస్టర్స్ అభ్యంతరకంగా ఉన్నాయని కొందరు విద్యార్థులు చిత్ర బృందంపై కేసు నమోదు చేశారు. దీనిపై గురువారం చిత్ర బృందం వివరణ ఇచ్చింది.

ఈ సందర్భంగా దర్శకుడు నరసింహానంది మాట్లాడుతూ, 'నా '1940లో ఓ గ్రామం' చిత్రానికి జాతీయ అవార్డు, మూడు నంది అవార్డులు, ఇతర అనేక పురస్కారాలు లభించాయి. అప్పట్నుంచి సమాజం కోసం, అభ్యుదయ భావాలు కలిగిన సినిమాలు తీసుకుంటూ వస్తున్నాను. నాక్కూడా సమాజానికి ఉపయోగపడే మంచి సినిమాలే తీస్తాననే పేరు వచ్చింది. మంచి సినిమానే నా నుంచి ఆశిస్తారు. అందులో భాగంగానే 'డిగ్రీ కాలేజ్' చిత్రాన్ని రూపొందించాను. కానీ ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని పోస్టర్స్ అభ్యంతరకరంగా ఉన్నాయని ఎస్పీ కార్యాలయంలో, కమిషనర్‌కి, ఎఫ్‌డీసీకి కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. దీంతో పోలీసులు మమ్మల్ని మూడు గంటలపాటు స్టేషన్‌లో వెయిట్ చేయించి, అభ్యంతరక పోస్టర్లని తొలగించాలని కోరారు. పోలీసు అధికారులు సూచించినట్టుగానే వాటిని తొలగించాం. సెన్సార్ పూర్తయిన సినిమాపై ఇలాంటి అభ్యంతరాలు తెలపడమేంటి?, పైగా ఇలాంటి కంటెంట్‌తో గతంలో ఎన్నో సినిమాలు వచ్చాయి. వాటి పోస్టర్స్ కూడా విడుదల చేశారు. వాటికి అభ్యంతరం చెప్పని వాళ్ళు, మా సినిమాని ఎందుకు కాంట్రవర్సీ చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఎంతో కష్టపడి, సొంత డబ్బుతో సినిమా నిర్మించాం. అలాంటి సినిమా విడుదలకు నోచుకోకపోతే మేమంతా రోడ్డున పడతాం. సినిమాని ఆపేయాలని కోరడం కరెక్ట్ కాదు. సినిమాలో ఏదైన అభ్యంతరకరమైన సన్నివేశాలుంటే, సినిమా చూసి చెప్పండి. వాటికి మేం తగు విధంగా చర్యలు తీసుకుంటాం. కానీ సినిమా చూడకుండానే విడుదల ఆపాలంటూ డిమాండ్ చేయడం సబబు కాదు. బేసిగ్గా నా సినిమాల్లో మహిళలను చాలా శక్తివంతంగా చూపిస్తాను. ఇందులోనూ అలాంటి పాత్రలే కనిపిస్తాయి. మా సినిమా విడుదలకు సహకరించాలని కోరుతున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపిరాజు, కొండయ్య, ఏలేటి శ్రీనివాసరావు పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## వకీల్ సాబ్‌గా పవన్!


పవన్‌కళ్యాణ్

పవన్ కళ్యాణ్ రీఎంట్రీపై క్లారిటీ రావడంతో ఆయన సినిమాలకు సంబంధించి రోజుకో న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఆయన 'పింక్' రీమేక్‌లో నటిస్తున్న విషయం విదితమే. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఈ సినిమాకి 'వకీల్ సాబ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారట. ఈ పేరుతో దిల్‌రాజు బ్యానర్‌పై ఫిల్మ్ ఛాంబర్‌లో టైటిల్ కూడా నమోదైందట. 'పింక్' సినిమా కోర్ట్ రూమ్ నేపథ్యంలో లాయర్ వాదనల ప్రధానంగా కథ సాగుతున్న నేపథ్యంలో దీనికి 'వకీల్ సాబ్' అనే టైటిల్ పవన్ సినిమాకే అని చిత్ర వర్గాలు అంటున్నాయి. ఇందులో అంజలి, నివేదా థామస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పవన్ ఓ పక్క ఈ సినిమా చేస్తూనే మరోవైపు వరుసగా సినిమాలకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం. క్రిష్ దర్శకత్వంలో ఓ చిత్రంలో చేస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని, ప్రగ్యా జైశ్వాల్, ఓ బాలీవుడ్ నటి హీరోయిన్లుగా నటించనున్నారని తెలుస్తోంది. దీంతోపాటు హరీష్ శంకర్ దర్శకత్వంలోనూ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే చిత్రాన్ని కూడా ఇటీవలే ప్రకటించారు. ఇదే కాదు, పవన్ ఏకంగా ఐదు సినిమాలతో రీఎంట్రీ ఇవ్వనున్నాడట. ఇప్పటికే మూడు సినిమాలు ఫైనల్ కాగా, మరో రెండు సినిమాలు కిషోర్ కుమార్ పార్థసాని(డాలీ), కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో చేయనున్నారట. దీంతో ఈ వార్తలు అటు ఇండస్ట్రీలో, ఇటు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారి హల్‌చల్ చేస్తున్నాయి.

అలియా భట్



## అలా.. కలల్ని నెరవేర్చుకుంటున్నా..

**అలియాభట్.. బాలీవుడ్‌లో అత్యంత క్రేజ్ సొంతం చేసుకున్న యువ కథానాయిక. తెలుగులోకి ఎంట్రీ ఇస్తూ 'ఆర్ ఆర్ఆర్'లో రామ్ చరణ్ సరసన మెరవనుంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీంతోపాటు సూపర్‌హీరో ప్రధానంగా తెరకెక్కే 'బ్రహ్మాస్త్ర'లో రణ్‌బీర్ కపూర్‌తో కలిసి నటిస్తుంది. ఇది మూడు భాగాలుగా విడుదల కానుంది. ఇక మొదటిసారి సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో 'గంగూబాయి'లో నటిస్తుంది. ముంబయి మాఫియా డాన్ గంగూబాయి కథియవాడి జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందుతుంది. అలాగే తండ్రి మహేష్‌భట్ రూపొందిస్తున్న 'సఢక్2'లోనూ కథానాయికగా నటిస్తుంది. ఇదిలా ఉంటే , మున్ముందు అలియా సొంతంగా ఓ ప్రైవేట్ జెట్‌ని కొనగోలు చేయనుందట. ఇప్పడికే తనకు వచ్చిన రెమ్యూనరేషన్‌తో ముంబయిలో తొలిసారి ఇల్లుని కూడా కొనుగోలు చేసి తన కలల్ని నెరవేర్చుకుంటోందట.**

## నాలుగు భాషల్లో శివలింగాపురం

ఆర్‌కే సురేష్, మధుబాల జంటగా తోటకృష్ణ దర్శకత్వంలో రావూరి అల్లికేశ్వరి సమర్పణలో అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మించిన చిత్రం 'శివలింగాపురం'. త్వరలో విడుదల కాబోతున్న ఈ చిత్రం గురించి నిర్మాత రావూరి వెంకటస్వామి మాట్లాడుతూ, 'కుటుంబ సమేతంగా చూడదగ్గ భక్తిరస చిత్రమిది. శివలింగాపురం అనే గ్రామంలో అత్యంత మహిమ గల శివలింగం దొంగతనానికి గురవుతుంది. అత్యంత ధైర్య సాహసాలతో ప్రాణాలకు తెగించి శివలింగాన్ని ఆ విద్రోహుల చెర నుండి హీరో ఎలా రక్షించాడనేది సినిమా. దర్శకుడు తోట కృష్ణ సినిమాని ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో మహా శివరాత్రి పర్వదినాన ఈ నెల 21న విడుదల చేయనున్నాం. ఆదరించి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. డీస్.రావు, బేబీ హర్షిత ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఘన శ్యామ్, ఎడిటింగ్: మేనగ శ్రీను, ఆర్ట్: బి.గిరీష్ బాబు.


డా॥బొమ్మారెడ్డి, శ్రీలక్ష్మీ మేఘనా

## ఇదే నా చివరి ప్రేమ కథ

**- వరల్డ్ ఫేమస్ లవర్ చిత్ర ట్రైలర్ లాంచ్‌లో విజయ్ దేవరకొండ**


ఇజాబెల్లె లెయితే, కేథరిన్ థ్రెస్సా, విజయ్ దేవరకొండ, రాశీఖన్నా

'ఈ ప్రపంచంలో నిస్వార్థమైనది ఏదైనా ఉందంటే అది ప్రేమ ఒక్కటే. ఆ ప్రేమలో కూడా నేను అనే రెండక్షరాలు ఓ సునామీనే రేపగలవు. ఐ వాంటెడ్ టు బి ద వరల్డ్ ఫేమస్ లవర్", "నా గుండెకు తగిలిన దెబ్బకి ఆ పెయిన్ తెలవకుండా ఉండాలంటే ఫిజికల్‌గా ఈ మాత్రం బ్లీడింగ్ ఉండాలి' అని అంటున్నారు విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా, రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్ థ్రెస్సా, ఇజాబెల్లె లెయితే హీరోయిన్లుగా, క్రాంతి మాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. కె.ఎస్.రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎ.వల్లభ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ గురువారం జరిగింది.

ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, 'నా సినిమా అంటే మళ్ళీ వీడు ఎలాంటి సినిమా చేస్తున్నాడని అందరిలో హడావిడి, ఎగ్జైట్‌మెంట్ ఉంటాయి. వీడితో నలుగురు హీరోయిన్లు ఎందుకు చేస్తున్నారని ఎగ్జిబిటర్స్‌లో, డిస్ట్రిబ్యూటర్స్‌లో ఎగ్జైట్‌మెంట్ ఉంటుంది. నాలుగు రెట్లు రిటర్న్స్ ఇస్తారనుకుంటూ ఉంటారు. ఈసారి నేనేం చేయలేదు. నేను చేసిన సినిమాలన్నింటిలో ఈ సినిమాలోనే ఎక్కువ కష్టపడ్డా. అందరం చాలా ఎఫర్ట్ పెట్టి చేశాం. ఈ నెల 9న ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉంది. ఇప్పుడు ఈ ట్రైలర్‌తో బయట హడావిడి స్టార్ట్ అవుతుంది. ఇది నా లాస్ట్ లవ్ స్టోరీ. మనిషిలా కొంచెం మారుతున్నా. టేస్టులు మారుతున్నాయి. లైఫ్‌లో కొత్త దశలోకి వెళ్తున్నా. ఇందులో నలుగురు బ్యూటీఫుల్ అమ్మాయిలతో కలిసి పనిచేయడం గర్వంగా ఉంది. ఇది కల నిజమవడం లాంటిది. నలుగురూ తమ నటనతో చించేశారు. నా లాస్ట్ లవ్ స్టోరీ కాబట్టి ఈ సినిమాని పూర్తిగా ప్రేమతో నింపేశాం. అన్ని రకాల ప్రేమని నింపి కంప్లీట్ ప్యాకేజ్ లవ్ స్టోరీగా దర్శకుడు క్రాంతిమాధవ్ సినిమాని తీర్చిదిద్దారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. క్రియేటివ్ కమర్షియల్స్ నిర్మించిన ఈ 47వ చిత్రం బిగ్ సక్సెస్ కావాలని ఆశిస్తున్నా. అలాగే క్రాంతిమాధవ్‌కి అతిపెద్ద సక్సెస్ రావాలని ఆశిస్తున్నా' అని చెప్పారు.

'ట్రైలర్ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా. విజయ్ దేవరకొండను ఇదివరకు మనం చాలా సినిమాల్లో చూశాం. ఈ సినిమాలో అతన్ని ఒక భిన్న తరహాలో చూపించాను. కంటెంట్‌కు తగ్గ విధంగా నలుగురు హీరోయిన్లు నటించారు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి క్షణాన్ని నేను ఆస్వాదించాను. అదే సమయంలో ఎంతో నేర్చుకున్నాను. జయకృష్ణ గుమ్మడి అద్భుతమైన విజువల్స్ అందించారు. రామజోగయ్య శాస్త్రి, శ్రేష్ఠ, రెహమాన్ చాలా బాగా పాటలకు లిరిక్స్ రాశారు. ఈ బ్యానర్‌లో నాకిది రెండో సినిమా. 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' కంటే ఈ సినిమాని ఇంకా బాగా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తాను' అని దర్శకుడు క్రాంతి మాధవ్ తెలిపారు.

చిత్ర సమర్పకులు కె.ఎస్. రామారావు మాట్లాడుతూ, 'ఒక ఫీస్ట్‌లా ఉండేలా క్రాంతి మాధవ్ ఈ సినిమాని తీర్చిదిద్దాడు. నలుగురు హీరోయిన్లు ఉండగా, వారికి ఈక్వల్‌గా విజయ్ దేవరకొండ తన నటనతో డామినేట్ చేస్తాడు. డైనమైట్‌లా విజయ్ ఎలా నటించగలడో, నటుడిగా ఆయనలోని మరో డైమెన్షన్‌ని ఈ సినిమా చూపిస్తుంది. విజయ్, రాశీ ఖన్నా ఒకరికొకరు పోటాపోటీగా నటించారు. ఒక ఫ్రస్టేటెడ్ లవర్‌గా నలుగురు హీరోయిన్లతో విజయ్ దేవరకొండ నటించిన విధానం నిజంగా ఎక్స్‌లెంట్. ఇది తెలుగు ప్రేక్షకుల సినిమాలా ఉండదు. ఓ హాలీవుడ్ సినిమాలా, హిందీ సినిమాలా ఉంటుంది. ప్రతి సినిమా లవర్‌కి ఇది నచ్చుతుంది. రాశీ ఖన్నా ఎంత కష్టపడిందో నేను చూశాను. అలాగే ఫ్రాన్స్‌లో తీసిన సన్నివేశాల్లో విజయ్‌తో ఇజాబెల్లె ఎంతో లవ్లీగా కనిపిస్తుంది. నల్లటి బొగ్గుగనిలో తెల్లటి డైమండ్‌లా కేథరిన్ మెరిసిపోతుంది. ఐశ్వర్యా రాజేష్ నేచురల్‌గా నటించింది. విజయ్ స్టన్నింగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాశీఖన్నా, కేథరిన్ థ్రెస్సా, ఇజాబెల్లా లెయితే, వల్లభ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

## కెరీర్‌లో గర్వంగా చెప్పుకునే సినిమా


నందు

'మనుగడ కోసం నేను హీరోగా కొన్ని సినిమాలు చేసుకుంటూ వచ్చాను. ఈ క్రమంలో అనేక విమర్శలొచ్చాయి. ఆ జర్నీ భావోద్వేగభరితం. 'సవారి' నా కెరీర్‌కి చాలా ముఖ్యమైన చిత్రం. రిజల్ట్ ఎలా ఉన్నా ఓ మంచి సినిమా చేశామనే ప్రశంసలు కచ్చితంగా దక్కుతాయి. కెరీర్‌లో గర్వంగా చెప్పుకునే చిత్రమవుతుంది' అని హీరో నందు అన్నారు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నందు హీరోగా రూపొందిన చిత్రం 'సవారి'. నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నందు గురువారం మీడియాతో మాట్లాడుతూ, 'నటుడిగా నాకు మంచి గుర్తింపు వస్తుంది. నందు బాగా నటిస్తాడు అని అంటుంటారు. కానీ నాకు ప్రత్యేకంగా పాత్రలను ఎవరూ రాయడం లేదు. ఈ చిత్ర దర్శకుడు సాహిత్ సెకండ్ హీరో కోసం ఈ కథ చెప్పారు. కానీ నాకు హీరో పాత్ర బాగా నచ్చింది. హీరోగా నేను చేయగలననే ఆలోచన వాళ్ళకి రావడం లేదనే బాధ నన్ను వెంటాడింది. అయినా ఓ రోజు సాహిత్‌కి మెసేజ్ పెట్టా. హీరో పాత్రకి నేను సూట్ అయితే నటిస్తానని చెప్పా. తెలంగాణ యాస మాట్లాడగలనా అని అనుమానం వ్యక్తం చేశాడు. అందుకోసం వర్క్ షాప్ చేశాం. తెలంగాణ యాసలో కొన్ని డైలాగ్‌లు చెప్పాను. అవి నచ్చి హీరోగా నన్ను ఫైనల్ చేశారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దాసారుబస్తీలో ఒక్క పూట అన్నం తింటూ, తాను పెంచుకున్న గుర్రం కోసం తపించే వ్యక్తి కథని చెప్పే చిత్రమిది. అతనితో ఓ సంపన్నమైన అమ్మాయికి మధ్య ప్రేమ కథ ఎలా సాగిందనేది ఆద్యంతం ఆసక్తికరం. నా పాత్ర చాలా ఇన్నోసెంట్‌గా ఉంటుంది. సినిమా మొత్తం వినోదాత్మకంగా, భావోద్వేగభరితంగా సాగుతుంది. అందులో అంతర్లీనంగా ఓ మంచి సందేశాన్ని అందించబోతున్నాం. ఇందులో అర్ధ నగ్నంగా నటించాలన్నప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. కథానాయిక పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. 'పెళ్ళిచూపులు'లో హీరోయిన్ పాత్ర తరహాలో ఇందులో హీరోయిన్ పాత్ర ఉంటుంది. ఇక దర్శకుడు సాహిత్‌కి, నాకు మంచి వేవ్ లెన్త్ కుదిరింది. తను వర్క్ హాలిక్ పర్సన్. సినిమా షూటింగ్ చాలా వరకు హైదరాబాద్‌లోని బస్తీలోనే చేశాం. సినిమాలో 'సవారి' ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుంది. నా లైఫ్ మొత్తం ఈ సినిమాకే పెట్టి పనిచేశా. ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. 13ఏండ్లుగా చిత్ర పరిశ్రమలో ఉన్నాను. శివనాగేశ్వరరావు 'ఫొటో'తో నా జర్నీ ప్రారంభమైంది. ఇంకా ఫిల్మ్ నగర్ దాకా రాలేకపోయాను. ఈ చిత్రంతో నా చుట్టూనే ఫిల్మ్ నగర్ చేరుతుందని శివనాగేశ్వరరావు అన్నారు. కానీ నాకంటూ ఓ గౌరవాన్ని తెచ్చే చిత్రమవుతుందని నమ్ముతున్నా. నెక్స్ట్ ఓ సినిమాలో హీరోగా నటించబోతున్నాను' అని చెప్పారు.

## ముగ్గురు కుర్రాళ్ళు చేసిన తప్పేంటి?


సుడిగాలి సుధీర్

అనిల్ కుమార్ జి దర్శకత్వంలో 'జబర్దస్త్' ఫేమ్ సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను, రాంప్రసాద్ హీరోలుగా రూపొందిన చిత్రం 'త్రీమంకీస్'. నేడు(శుక్రవారం) సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం సుడిగాలి సుధీర్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ ఆఫర్‌ని మొదట అవినాష్(జబర్దస్త్) తీసుకొచ్చారు. గెటప్ శ్రీను, రాంప్రసాద్‌లకు నచ్చింది. అయితే అవినాష్‌కి బదులు మేం ముగ్గురం నటిస్తే బాగుంటుందని, నా కోసం అవినాష్ ఈ ప్రాజెక్ట్‌ని వదులుకున్నాడు. ముగ్గురు కోతుల్లాంటి కుర్రాళ్ళు చేసిన ఓ తప్పు వల్ల ఓ సమస్యలో ఇరుక్కుంటారు. దాన్నుంచి బయటపడేందుకు ఏం చేశారనేది సినిమా. ఆద్యంతం హాస్యభరితంగా సినిమా సాగుతుంది. ఇందులో నేను సంతోష్ అనే మార్కెటింగ్ పర్సన్‌గా కనిపిస్తాను. సినిమాలో పాప సెంటిమెంట్‌తో కూడిన ఓ ట్విస్ట్ ఉంటుంది. అది హైలైట్ అవుతుంది. సినిమా వినోదభరితంగా సాగుతూనే మంచి సందేశాన్ని కూడా అందిస్తుంది. మేం జబర్దస్త్ ద్వారా టీవీ ఆడియెన్స్‌ని నవ్విస్తున్నాం. బుల్లితెరపై చూసిన వాళ్ళు వెండితెరపై చూస్తారనే అనుమానం ఉండేది. కానీ నేను నటించిన 'సాఫ్ట్‌వేర్ సుధీర్'తో అది పోయింది. సినిమాకి మిశ్రమ స్పందన లభించినా, నా కోసం నా అభిమానులు సినిమా చూశారు. మంచి కలెక్షన్లు వచ్చేందుకు దోహదపడ్డారు. దీంతో మమ్మల్ని చూసేందుకు ఆడియెన్స్ వస్తారనే నమ్మకం కలిగింది. అందుకే ఈ సినిమాని కచ్చితంగా ఆదరిస్తారని నమ్ముతున్నా. నేను నటించే సినిమాలకు కథే హీరో. ఆ కథని నేను నడిపిస్తాను. హీరోగా అనిపించుకోవాలని ఏ రోజు అనుకోవడం లేదు. బేసిక్‌గా నేను చిరంజీవిగారిని స్ఫూర్తిగా తీసుకుని, ఆడియెన్స్‌కి ఎంటర్‌టైన్‌మెంట్‌ని పంచాలని చిత్ర పరిశ్రమలోకి వచ్చాను. ఆ వినోదం పంచేందుకు మెయిన్ లీడ్‌గానైనా, కమెడీయన్‌గానైనా, రెండు నిమిషాల పాత్రల్లోనైనా నటిస్తాను. నవ్వించడమే నా మెయిన్ ఎయిమ్. ప్రస్తుతం అఖిల్ 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' చిత్రంలో నటిస్తున్నా' అని అన్నారు.



# సురక్షిత జీవనం మా హక్కు

నేలలో సగం.. నింగిలో సగం.. విశ్వంలో సగం.. ఉత్పత్తిలో సగం.. ఇప్పుడు ఆ సగానికి జీవించే హక్కు కాలరాయబడుతున్నది. ఇంటా బయట రక్షణ కరువయింది. ఈ పెరిగిపోతున్న హింసకు కారణాలను మూలాల నుండి వెదికి వాటిని సమూలంగా తుడిచివేయాలి. దీని కోసం ఎన్నో సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయి. అందులో భాగంగానే 'ఆఫ్ ది స్కై ఆఫ్ ది ఎర్త్' సంస్థ ఆధ్వర్యంలో శ్రామిక మహిళలతో ఓ వర్క్‌షాప్ జరిగింది. ఆ విశేషాలు మానవి పాఠకుల కోసం...

### ప్రత్యేక సౌకర్యాలు అవసరం



నేను ఫార్మసిటిక్ కంపెనీలో పని చేస్తున్నా. పని ప్రదేశాల్లో మహిళలకు కొన్ని సదుపాయలు కావాలి. ఎందుకంటే మహిళలకు కొన్ని ప్రత్యేకమైన సమస్యలు వుంటాయి. నెలసరి సమయంలో, గర్భంతో ఉన్నప్పుడు కొన్ని ఇబ్బందులు వుంటాయి. రెస్ట్ తీసుకోవాల్సి వస్తుంది. ఇటు ఇంట్లో అటు ఆఫీసులో మగవారికంటే మహిళలు ఎక్కువగా పని చేస్తుంటారు. ఇలాంటి సౌకర్యాలు కల్పిస్తే మహిళలు ఇంకాస్త ఎక్కువగా పని చేయగలుగుతారు. ఇలాంటి వర్క్ షాపుల వల్ల కొంతైనా మహిళల్లో అవగాహన వస్తుంది.

**- పావని**

'వర్కింగ్ ఉమెన్స్ కలెక్టివ్ ఫర్ సేఫ్ స్పేసెస్' అనే పేరుతో వివిధ రంగాల్లో పని చేస్తున్న సుమారు 125 మంది మహిళా ఉద్యోగులతో ఈ వర్క్ షాప్ జరిగింది. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు ఏం చేయాలనే విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. చర్చల్లో పాల్గొన్న శ్రామిక మహిళలు, స్వచ్ఛంద కార్యకర్తలు, విద్యావేత్తలు మహిళల రక్షణ ప్రాధాన్యతను నొక్కి వక్కాణించారు. వీరంతా కొన్ని డిమాండ్స్‌ను రూపొందించారు. వీటి అమలుకు అందరూ కలిసి ఐక్యంగా కృషి చేయాలని తీర్మానించుకున్నారు.

**వివక్ష కొనసాగుతూనే వుంది:** మహిళపై దాడి జరిగిన తర్వాత స్పందించినా దాని వల్ల పెద్దగా ఉపయోగం లేదు. ముందు ఆ దాడులు జరక్కుండా చూడాలి. ఇదే ఈ వర్క్ షాప్ ముఖ్య ఉద్దేశం. కోట్లల్లో వ్యాపారం చేస్తున్న పెద్ద పెద్ద కంపెనీల్లో కూడా జెండర్ సెన్సిటైజేషన్ పట్ల కనీస అవగాహన ఉండడం లేదని కొంతమంది ఐటీ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. మగవారితో సమానంగా ఉత్పత్తిలో భాగస్వామ్యమవుతున్నా మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే వుంది. దిశ, సమత సంఘటనలు మన రాష్ట్రాన్నే కాక దేశంలోని ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురిచేశాయి. నిర్భయ ఘటన జరిగిన తర్వాత వర్మ కమిషన్ ఎన్నో సూచనలు చేసింది. ఒక్కటి కూడా సరిగా అమలు కావడం లేదు. ఫలితంగానే ఇలాంటివి కొనసాగుతున్నాయి. నిర్భయ చట్టం కింద విడుదలవుతున్న నిధులు వృధా అయిపోతున్నాయని స్వచ్ఛంధ సంస్థల కార్యకర్తలు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మహిళలు ఈ సమాజంలో సురక్షితంగా జీవించాలంటే కచ్చితంగా కొన్ని నిర్దిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**సలీమ**

### డిమాండ్స్

- వీధి లైట్లు లేని చోట వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలి.
- మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలన్నింటినీ ప్రచారం చేయాలి. వాటిని సక్రమంగా అమలు చేయాలి.
- రిమోట్ ఏరియాల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి. అలాగే పెట్రోలింగ్ వాహనంలో మహిళా పోలీసులు కచ్చితంగా వుండేలా చూడాలి.
- లింగ అంతరాన్ని నిర్మూలించేలా అన్ని రంగాలలో మహిళా సిబ్బందిని ఎక్కువగా నియమించాలి.
- ఆపదలో ఉన్న మహిళ 100 వంటి అత్యవసర సేవలకు కాల్ చేసినపుడు త్వరగా స్పందించాలి. బాధితురాలు ఫోన్ చేసినప్పటి నుండి అక్కడకు చేరుకునే వరకు ఆమెతో మాట్లాడుతూ వుండాలి.
- బస్సులు, మెట్రోలు, రైళ్లలో ట్యాపర్ ప్రూఫ్ సీసీటీవీ కెమెరాలు, డిస్ట్రెస్ అలారాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలి.
- పని ప్రదేశాల్లో మహిళల కోసం సురక్షితమైన, పరిశుభ్రమైన విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి.
- అన్ని సంస్థల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాలను కఠినంగా అమలు చేయాలి. చట్టం సరిగా అమలు చేయకపోతే దానికి సంస్థ యాజమాన్యమే బాధ్యత వహించాలి.
- ప్రతి సంస్థల్లో నిత్యం జెండర్ సెన్సిటైజేషన్‌పై అవగాహనా తరగతులు ఏర్పాటు చేయాలి. సాధారణ ప్రజలకు పోలీసులు బాధ్యత తీసుకుని వారిలో జెండర్ సెన్సిటైజేషన్ గురించి అవగాహన కల్పించాలి.
- ప్రతి మహిళా స్వయంప్రతిపత్తిని, తనకు తాను రక్షణ కలిగివుండేలా తనని తాను సిద్ధం చేసుకునేలా ప్రోత్సహించాలి. దీని కోసం సంస్థ యాజమాన్యం సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు ఏర్పాటు చేయాలి.
- మహిళా సిబ్బంది ఎక్కువ సమయం ఆఫీసుల్లో ఉండవల్సి వస్తే భద్రతా సిబ్బంది ద్వారా సురక్షితమైన రవాణా ఏర్పాటు చేయాలి. భద్రతా సిబ్బందిని సైతం ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలి. మహిళా డ్రైవర్లు, భద్రతా సిబ్బందిలో కూడా మహిళలు ఉండేలా చూడాలి.
- ప్రతి సంస్థలో సురక్షితమైన, పరిశుభ్రమైన క్రెచ్, నర్సింగ్ గదులు, సిక్ రూమ్స్ ఏర్పాటు చేయాలి.

### జెండర్ సెన్సిటైజేషన్‌పై క్లాసులు పెట్టాలి



ఐటీ ఇండస్ట్రీలో పదేండ్ల అనుభవం వుంది. వివక్ష అనేది సినిమాల్లో చూపించినట్టు బయట కనిపించదు. వినడానికి కొన్ని చిన్న చిన్న విషయాల్లా అనిపిస్తాయి. అలాంటి మాటలను చాలామంది వివక్ష అని కూడా అనుకోరు. నేను ఎప్పుడైనా ఆఫీసులో ఎక్కువ టైం వుండి పని చేసుకుంటుంటే ఇంట్లో మీ ఆయన వంట చేస్తాడా అంటూ ఎగతాళిగా అడుగుతుంటారు. నాకు రావల్సిన ఇన్సెంటీవ్‌లు అడుగుతుంటే మీ ఆయన సంపాదిస్తున్నాడు, నీ పేరెంట్స్ సంపాదిస్తున్నారు ఇక నీకెందుకు అంత డబ్బు పిచ్చి అన్నట్టు మాట్లాడతారు. నచ్చని విషయం గురించి గట్టిగా అడిగానంటే ఈ అమ్మాయి గయ్యాళి అనే లేబుల్ అంటించేస్తారు. ఇదే విషయాన్ని అబ్బాయిలు అడిగితే 'అబ్బా ఎంత ధైర్య వంతుడు, భలే ప్రశ్నించాడు' అంటూ మెచ్చుకుంటారు. ఇవన్నీ చాలా చిన్న విషయాల్లా, సరదాగా అనిపించినా మనసును చాలా బాధపెడతాయి. అందుకే ఆఫీసుల్లో జెండర్ సెన్సిటైజేషన్ పై రెగ్యులర్‌గా ట్రైనింగ్ క్లాసులు పెట్టాలి. మాకు ప్రతి మూడు నెలలకు ఓసారి ప్రొఫెషన్‌కు సంబంధించిన ట్రైనింగ్ ఇస్తారు. జెండర్ సెన్సిటైజేషన్ గురించి మాత్రం పెట్టరు. మహిళా ఉద్యోగులతో ఎలా మాట్లాడాలో మగవాళ్ళకు ఈ ట్రైనింగ్‌లో నేర్పించాలి.

**- మంజుషా**

### అవగాహన పెంచాలి



వివిధ రంగాల్లో పని చేస్తున్న వర్కింగ్ ఉమెన్ ఈ కన్వెన్షన్‌కి వచ్చారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారనే విషయాలపై చర్చ జరిగింది. అందరూ ఎన్నో సూచనలు ఇచ్చారు. మహిళల రక్షణ కోసం ఏం చేయగలం అనే దానిపై కొన్ని డిమాండ్స్‌ను రూపొందించాం. నేను పని చేసేది ఐటీ రంగంలో. ఎంతో అభివృద్ధి చెందాయి అని చెప్పుకునే ఈ ప్రాంతాల్లో కూడా వీధి లైట్లు లేవు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేదు. ఉన్న ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు కూడా తగ్గించేస్తున్నారు. సమాజంలో ఎవ్వరికీ జెండర్ సెన్సిటైజేషన్ గురించి అవగాహన లేదు. వివక్ష ఎందుకు జరుగుతుంది. ఎలా జరుగుతుంది. అది పోవాలంటే ఏం చేయాలి. వర్కింగ్ మదర్‌కి ఎలాంటి సదుపాయాలు కావాలి. వీటన్నిటినీ మా డిమాండ్స్‌లో రూపొందించుకున్నాం. మహిళల రక్షణ కోరుతూ సంతకాల సేకరణ కూడా చేస్తున్నాం. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ సంతకాలను హోం మినిస్టర్‌కు, మహిళా శిశుసంక్షేమ శాఖకు అందించాలని నిర్ణయించుకున్నాం. 'వర్కింగ్ ఉమెన్ కన్వెన్షన్ డాట్ ఇన్' అని వెబ్‌సైట్‌లో కూడా సంతకాలు చేయవచ్చు.

**- ప్రవల్లిక, 'ఆఫ్ ది స్కై ఆఫ్ ది ఎర్త్' నిర్వాహకురాలు**



సమాజంలో ఒక మహిళగా గొంతు విప్పి ధైర్యంగా మాట్లాడడానికి చాలా కాలం పట్టింది. ఇక మౌనంగా ఉండటానికి నా మనసు అంగీకరించడం లేదు.

**- మడేలిన్ ఆల్బ్రయిట్**

అద్దె ఇల్లు అయినా.. సొంతిల్లు అయినా.. ప్రతి గదినీ మన అభిరుచికి తగినట్టే అలంకరిస్తాం కదా. కానీ ఆ బాత్రూంను మాత్రం ఎందుకు అలా వదిలేయడం? దాన్ని కూడా ఎంతో కొంత అలంకరించుకోవచ్చు కదా. నిజం చెప్పాలంటే.. చాలామందికి తమ ఇంట్లోని బాత్రూం అంతగా నచ్చదు. టైల్స్ బాగాలేకపోవడం, గాలీవెలుతురు సరిగ్గా రాకపోవడం, ఇరుగ్గా అనిపించడం, బాత్రూం గోడలకున్న పెయింట్ బాగా లేకపోవడం లాంటివి దీనికి కారణం. అయితే కొన్ని మార్పులు చేయడం ద్వారా దాన్ని కూడా అందంగా మార్చుకోవచ్చు.

## అందంగా కనిపించాలంటే...

**ఫెయిరీ లైట్స్:** ఫెయిరీ లైట్స్‌ను ఇంట్లో ఏ మూల అలంకరించినా ఇంటిని అందంగా, డ్రీమీగా, రిచ్‌గా మార్చేస్తాయి. బాత్రూంని సైతం డ్రీమీగా మార్చుకోవాలని భావించేవారు.. ఈ ఫెయిరీ లైట్స్‌తో అలంకరించుకోవచ్చు. బాత్రూం గోడల టాప్ కార్నర్‌లో వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. వీటివల్ల మనకు షాక్ కొట్టే అవకాశం ఉంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ కిందకు లేదా మన చేతులు, శరీరానికి తగిలే విధంగా వాటిని వేలాడదీయవద్దు.

**బాత్ మ్యాట్స్:** సాధారణంగా మనం ఇంట్లో మల్టీ పర్పస్ వస్తువులను మాత్రమే వాడడానికి ఇష్టపడుతుంటాం. ఈ వాటర్ మిలన్ బాత్ మ్యాట్స్ కూడా అలాంటివే. వీటిని బాత్రూం డోర్ ముందు వేయచ్చు. ఇవి మీ బాత్రూంకి స్పెషల్ లుక్ ఇవ్వడంతో పాటు.. తడి కాళ్లను తుడుచుకోవడానికి సైతం ఉపయోగపడతాయి.

**మొక్కలు:** అసలు ఇల్లు పచ్చగా ఉంటే ఆ అందమే వేరు. ఈ మొక్కలు గాలిని శుద్ధి చేయడంతో పాటు ఆహ్లాదాన్ని కూడా అందిస్తాయి. అయితే బాత్రూంలో పెద్ద పెద్ద ఇండోర్ ప్లాంట్స్ ఉన్న కుండీలు ఉంచడం సాధ్యం కాకపోవచ్చు. కానీ బాగా ఎత్తు ఎదగని మొక్కలను మాత్రం బాత్రూంలో ఉంచవచ్చు.



**కొవ్వొత్తులు:** అరోమా క్యాండిల్స్ నుంచి వెలువడే పరిమళాలు.. మనలోని ఒత్తిడిని తగ్గించి మూడ్‌ని ఉల్లాసంగా మార్చేస్తాయి. ముఖ్యంగా బిజీబిజీగా రోజు గడిపి వచ్చిన తర్వాత.. ఫ్రెషప్ అయ్యే సమయంలో ఈ క్యాండిల్స్ వెలిగించుకుని స్నానం చేస్తే ఒత్తిడి ఉఫ్‌మని ఊదేసినట్టు వెళ్లిపోతుంది.

**షవర్ కర్టెన్:** నిజం చెప్పుకోవాలంటే.. చాలామంది బాత్రూంలో షవర్ కర్టెన్లను ఏర్పాటు చేసుకోవడం అరుదు. కానీ అందమైన షవర్ కర్టెన్ వేయడం ద్వారా.. మొత్తం బాత్రూం లుక్‌నే మార్చేయవచ్చు. దీన్ని ఏర్పాటు చేయడం వల్ల మనం స్నానం చేసిన నీరు బాత్రూం అంతా చిందకుండా ఉంటుంది. సాధారణంగా ప్లెయిన్ షవర్ కర్టెన్లు ఉపయోగిస్తారు. వాటికి బదులుగా గ్రాఫిక్ షవర్ కర్టెన్లు ఉపయోగిస్తే బాగుంటుంది.

## చర్మం నల్లబడుతుంటే...

కొంతమందికి శరీరంపై వివిధ భాగాల్లో చర్మం నల్లబడుతుంటుంది. మరీ ముఖ్యంగా ఎండ వేడి తాకే ప్రాంతాల్లో ఇది మరింత స్పష్టం గా కనిపిస్తుంది. ఎండలోకి వెళ్తే చాలు...చర్మం పై మంట పుడుతుంది. ఎండ తాకిన ప్రాంతం నల్లబడుతుంది. కొంతమందికి చర్మంపై మచ్చలు ఏర్పడుతాయి. ఈ విధమైన సమస్యలను పిగ్మెంటేషన్ సమస్యలుగా చెబుతుంటారు.

- హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్ సంబంధిత సమస్యలు, దీర్ఘకాలంగా వాడుతున్న కొన్ని రకాల మందుల కారణంగా, శిరోజాలకు క్రమం తప్పకుండా రంగు వేసుకునే వారికి ఈవిధమైన పిగ్మంటేషన్ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. ఇవి సూర్యుడి అతి నీలలోహిత కిరణాల వల్ల ఇంకా ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యలు వచ్చిన తరువాత తగుచర్యలు తీసుకోవడం కంటే కూడా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే మేలు. ఆరంభదశలోనే ఈ సమస్యలను గుర్తిస్తే పరిష్కారం కూడా సులువే అవుతుంది. అందుకు కొన్ని చిట్కాలు....
- మంచినీళ్ళు ఎక్కువగా తాగాలి. తాజా పండ్ల రసాలు, మజ్జిగ ఎక్కువగా తాగాలి.



- నల్ల ద్రాక్ష, పుచ్చకాయ, దానిమ్మ పండ్లు ఎక్కువగా తినాలి.
- బయటకు వెళ్ళడానికి 30 నిమిషాల ముందే సన్‌క్రీమ్ లోషన్ ముఖానికి రాసుకోవాలి.
- నల్ల ద్రాక్ష గుజ్జుకి కొంచెం తేనె కలిపి ప్రతి రోజూ స్నానానికి 20 నిమిషాల ముందు ముఖానికి రాసుకుని ఆ తరువాత చన్నీళ్ళతో ముఖాన్ని కడుక్కోవాలి.
- కొంచెం క్యారెట్, కొంచెం క్యాబేజీ, కొంచెం ఓట్స్ కలిపి మిక్సర్‌లో వేసి పేస్ట్‌గా తయారు చేసి, దానిలో సగం చెంచా పాల మీగడ, సగం చెంచా తేనె, మూడు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవాలి. 20 నిమిషాల తరువాత కొంచెం గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే ముఖంపై నల్లమచ్చలు క్రమంగా తగ్గుముఖం పడుతాయి.
- పిగ్మెంటేషన్ సమస్య ఉన్న వాళ్ళు ఎండలో బయటకు వెళ్లి వస్తే, ముఖం కడుక్కొని కీరాను గుండ్రటి ముక్కలుగా కోసి ముఖం పై 20 నిమిషాల పాటు ఉంచుకొని రిలాక్స్ కావాలి. దీని వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి. బాదం గింజలను నానబెట్టి పేస్టు చేసుకోవాలి. దీంట్లో కొంచెం పాలపొడి, కొద్దిగా తేనె, కొన్ని చుక్కల నిమ్మరసం, కొంత ఆలివ్ ఆయిల్‌ను చేర్చాలి. ఈ మిశ్రమాన్ని మెడచుట్టూ పట్టించాలి. 30 నిమిషాలు ఆగి కడిగేయాలి. దీనివల్ల మెడచుట్టూ ఉన్న నల్లటి వలయాలు పోయి అందంగా ఉంటుంది.

### ఇట్లా చేద్దాం

కొత్తిమీర, కరివేపాకు, పుదీనా వంటి ఆకుకూరలు పేపర్‌లో చుట్టి పాలిథిన్ కవర్‌లో వుంచితే ఎక్కువ కాలం నిలవ ఉంటాయి.



## జోలపాట పాడండి...



బిడ్డ పుట్టగానే బాధ్యత తీరిపోయిందని ఏ తల్లీ అనుకోదు. ఆ పిల్లవాడిని గొప్ప మనిషిగా తీర్చిదిద్ది, ఈ లోకానికి అందించేవరకూ ఆమె విశ్రమించదు. ఆ ప్రయాణంలో ప్రతి అడుగూ ఓ అద్భుతమే! అందుకే తల్లీబిడ్డల మధ్య బంధం పరిశోధకులకి ఓ హాట్టాపిక్! అలా ఈమధ్య జరిగిన ఓ పరిశోధనలో, తల్లి లాలిపాట కూడా పిల్లవాడి ఎదుగుదల మీద గొప్ప ప్రభావం చూపుతుందని తేలింది.

ప్రాంతానికీ, భాషకీ అతీతంగా ప్రపంచంలోని ప్రతి తల్లీ పిల్లవాడిని తన పాటతో లాలిస్తుంది. అసలు సంగీతం లాలిపాటతోనే మొదలైందని అంటారు. ప్రపంచంలో బెస్ట్ సింగర్ తల్లే అని ఒప్పుకుంటారు. అందుకే మియామీ యూనివర్సిటీ పరిశోధకులు పిల్లవాడి మీద తల్లి లాలిపాట ప్రభావం గురించి పరిశోధించే ప్రయత్నం చేశారు. తల్లి లాలిపాట పాడుతున్నప్పుడు వారి మానసిక స్థితినీ, వేరే సంగీతం వింటున్నప్పుడు వారి ఉద్వేగాలనీ పరిశీలించారు. లయబద్ధంగా, ప్రేమగా సాగే లాలిపాటని వినగానే పిల్లవాడిలో అలజడి సద్దుమణిగిపోతున్నట్లు తేలింది.

- లాలిపాట పాడుతున్నప్పుడు పిల్లవాడు తల్లి వంకే చూస్తుంటాడు. పిల్లవాడి స్పందనలకు అనుగుణంగా తల్లి కూడా, పాటలోని లయని మారుస్తూ ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్యా గొప్ప అనుబంధం ఏర్పడుతున్నట్లు గమనించారు. లాలిపాటతో పిల్లలు శబ్దాలను కూడా సులువుగా గ్రహించగలుగుతున్నారట. అలా లాలిపాట పిల్లవాడికి భాషని కూడా పరిచయం చేస్తోందన్నమాట.
- లాలిపాట పాడుతూ పిల్లవాడితో గడపడం వల్ల తల్లి మనసు కూడా ప్రశాంతత పొందుతున్నట్లు తేలింది. చాలామంది తల్లులు డెలివరీ తర్వాత, శరీరంలోని హార్మోనుల మార్పులతో డిప్రెషన్‌కు లోనవుతారు. దీన్నే పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ అంటారు. తల్లిలో ఏర్పడే ఈ నిరాశ నుంచి దృష్టి మళ్లించేందుకు లాలిపాట మందులా పనిచేస్తుందట. అంటే అమ్మ తనని తాను సంభాలించుకుంటూ, పిల్లవాడికి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందన్నమాట.

## ఆరోగ్యానికి డ్రై ఫ్రూట్స్

**బాదం పప్పు:** బాదం పప్పు మంచి పోషకాహారం. బాదం పాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమైనవి. మామూలుగా మనం తీసుకునే పాలతో పోలిస్తే ఇవి ఎంతో ఉత్తమమైనవి అని చెప్పవచ్చు. ఆవుపాలు తాగడానికి ఇష్టపడని పిల్లలకు బాదం పాలు పట్టవచ్చు. బాదం పప్పులో ఇనుము, రాగి, ఫాస్ఫరస్ వంటి ధాతువులు, విటమిన్ 'బి' లు ఎక్కువగా ఉంటాయి. వీటి రసాయనిక చర్యల వల్ల అధిక శక్తి లభిస్తుంది. రక్తకణాలు, హీమోగ్లోబిన్ సృష్టికి, గుండె, మెదడు, నాడులు, ఎముకలు, కాలేయం సక్రమంగా పనిచేయడానికి ఆల్మండ్‌లు ఎంతగానో తోడ్పడుతాయి. కండరాలు దృఢంగా, ఎక్కువ కాలం పనిచేసేందుకు ఇవి ఎంతగానో తోడ్పడుతాయి. బాదం నూనెను రోజూ కొద్దిగా నెత్తికి రాసుకుంటే జుట్టు రాలడం తగ్గిపోతుంది. చుండ్రు, వెంట్రుకలు ఊడటం వంటి వాటికి చక్కటి పరిష్కారం చూపుతుంది. ఎగ్జిమా వంటి చర్మం వ్యాధులకు అడవి బాదం ఆకులు చాలా బాగా పనిచేస్తాయి. ఇందుకోసం బాదం ఆకులను తీసుకొని వాటిని చూర్ణం చేసి, నీటిలో పేస్ట్‌లాగా కలిపి ఎగ్జిమా ఉన్న ప్రాంతాల్లో రాస్తే సత్వర ఫలితం కనబడుతుంది. బాదం పప్పు పేస్ట్‌కి పాలను కలిపి రోజూ ముఖానికి రాసుకుంటే కాంతి వంతంగా ఉంటుంది.



**జీడిపప్పు:** శరీరానికి కావలసిన ప్రొటీన్లు ఇందులో అధికంగా ఉంటాయి. వీటిల్లో పొటాషియం, విటమిన్ బి, కూడా పుష్కలంగా ఉంటాయి. అంతేకాకుండా వీటిలో ఉండే అసంతృప్త కొవ్వు పదార్థాలు గుండె జబ్బులను నివారించే సామర్థ్యాన్ని కలిగిఉంటాయి. మెగ్నీషియం, ఫాస్ఫరస్, సెలీనియం, రాగి వంటివి తగిన పరిమాణంలో లభిస్తాయి.

**ఎండు ద్రాక్ష:** ద్రాక్ష పండ్లను ఎండబెట్టినప్పుడు, ఎండు ద్రాక్ష తయారవుతుంది. మంచి పోషకాహార విలువలు కలిగి ఉంటాయి. కొన్ని రకాల వ్యాధులు సోకినప్పుడు ఇవి ఉత్తమ ఆహారంగా ఉపయోగపడుతాయి. అదేవిధంగా ఎండు ద్రాక్షను బాగా వేడి చేసిన నీళ్ళలో నానబెట్టి పిల్లలకు ఇస్తే వారిలో జీర్ణశక్తి బాగా వృద్ధి అవుతుంది. కాకపోతే నానబెట్టే ముందు వీటిని పొడిగా చేయాల్సి ఉంటుంది. దీనివల్ల పండ్లలోని రసం నీటిలో బాగా కలిసి పోయి పిల్లలకు పోషకాలు అందుతాయి. ఇవి రక్త హీనతకు మంచి మందుగా ఉపయోగపడతాయి.

**ఖర్జూరం:** ప్రకృతి సిద్ధంగా లభించే గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లు వీటిలో ఉంటాయి. ఖర్జూరాలను నీళ్ళలో రాత్రంతా నానబెట్టి తింటే మంచి ఆరోగ్యం లభిస్తుంది. చిన్నపేగుల్లో చోటు చేసుకొనే సమస్యలకు వీటితో పరిష్కారం లభిస్తుంది.

**అంజీర్:** ఎండిన అంజీర్ పండులో పీచు, రాగి, మంగనీస్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం, విటమిన్-కె వంటివి పుష్కలంగా ఉంటాయి. కాల్షియం పీచు రూపంలో కలిగి ఉండేది అంజీర్ మాత్రమే.

# టోక్యో ఒలింపిక్స్ వేరు



## • రియోలో నాపై అంచనాలు లేవు
## • బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధు



**హైదరాబాద్ :** స్పోర్ట్స్ క్యాలెండర్‌లో 2020 ఎంతో ముఖ్యమైనది. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు మరో ఆరు నెలల గడువే మిగిలి ఉంది. భారత్ ఈసారి జపాన్ నుంచి 10కి పైగా పతకాలతో స్వదేశానికి రావాలని కోరుకుంటోంది. పది ప్లస్ పతకాల ప్రణాళికలో ముఖ్యమైన క్రీడ బ్యాడ్మింటన్. ఈ క్రీడాంశం నుంచి భారత్ కనీసం రెండు పతకాలు ఆశిస్తోంది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, బి.సాయిప్రణీత్, సమీర్ వర్మ, హెచ్.ఎస్ ప్రణయ్‌లు రేసులో ఉండగా.. డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాంకీ రెడ్డి, చిరాగ్ శెట్టిలపై అంచనాలు ఉన్నాయి. మహిళల సింగిల్స్‌లో సహజంగానే స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పి.వి సింధులపై మెడల్ ఆశలు ఎక్కువగా ఉన్నాయి. ఒలింపిక్స్ ఏడాదిలో మన షట్లర్ల ప్రదర్శన నిరాశజనకంగా కనిపిస్తున్నా.. మెగా టోర్నీల స్టార్ పి.వి సింధుపై బలమైన అంచనాలు నెలకొన్నాయి. టోక్యోలో స్వర్ణ పతకం ఆశిస్తోన్న పి.వి సింధు ఆ ఘనత సాధిస్తే దిగ్గజ షూటర్ అభినవ్ బింద్రా సహా దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ సరసన నిలువనుంది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో హైదరాబాద్ హంటర్స్ తరఫున ఆడుతున్న పి.వి సింధు తన ప్రాక్టీస్, ఫోకస్‌ను పూర్తిగా ఒలింపిక్స్‌పై కేంద్రీకరించింది. ఈ నేపథ్యంలో రియో ఒలింపిక్స్ మెడలిస్ట్‌గా, టోక్యో ఒలింపిక్స్ సన్నద్ధత, అంచనాలపై తెలుగు తేజం పి.వి సింధు పలు విషయాలు వెల్లడించింది. ఆ వివరాలు సింధు మాటల్లోనే..

• **పీబీఎల్ హైదరాబాద్‌లో జరుగుతుంది, ఇంటి దగ్గర ఉన్న భావనలో ఉన్నారా?**

ఇంటి దగ్గర ఉన్న భావనే ఉంది (నవ్వుతూ). హైదరాబాద్ హంటర్స్ శిబిరంలో ఉండటం ఎంతో సంతోషకరం. హంటర్స్ తరఫున ఇది నాకు రెండో సీజన్. హైదరాబాద్‌లో ఆడటం నాకు మరింత సంతోషం ఇస్తుంది. ఇక్కడ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. పీబీఎల్ మ్యాచులకు నేరుగా వచ్చి చూస్తున్నారు. నిజానికి మా మ్యాచులను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం వారికి పెద్దగా ఉండదు. హైదరాబాద్‌లో ఆడటం మంచి అనుభూతి.

• **2019 ఏడాది ప్రథమార్థం గొప్పగా సాగింది. వరల్డ్ చాంపియన్‌గా నిలిచారు. కానీ తర్వాత ఓటములతో మీడియాలో ప్రతికూల కథనాలు వెలువడ్డాయి. మీపై ఏమైనా ప్రభావం చూపాయా?**

నిజానికి ఎటువంటి ప్రభావం చూపవు. కానీ మనం విజయాలు సాధించినప్పుడు అందరూ వచ్చి అభినందనలు తెలుపుతారు. మన విజయాల గురించి చాలా మంది గొప్పగా మాట్లాడటం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అభినందనలు మనల్ని ప్రోత్సాహించటంతో పాటు వారి ప్రేమను తెలియజేస్తాయి. వరల్డ్ చాంపియన్స్ తర్వాత కొన్ని టోర్నీల్లో పరాజయం పాలయ్యాను. వరల్డ్ చాంపియన్‌షిప్స్ తర్వాత నీ రిథమ్ పడిపోయిందని జనాలు అనటం మొదలుపెట్టారు. కానీ ఇక్కడ నేనోక నిశ్చయానికి వచ్చాను. నాకు ఏం కావాలో, నాకు ఏం వద్దో స్పష్టత తెచ్చుకున్నాను. మీడియా కథనాలు నిజంగా నన్ను బాధపెడితే, వాటి వైపు చూడకూడదని అనుకున్నా. సోషల్ మీడియా క్రియాశీలంగా ప్రతిదీ క్షణాల్లో తెలిసిపోతుంది. ప్రతికూల కథనాలు నన్నేమి బాధపెట్టలేదు. అయినా, నేను సానుకూల దృక్పథంతో ఉండాలని అనుకున్నాను. నేను అనుకున్నదే చేస్తున్నాను.

• **కొరియా కోచ్ కిమ్ జీ హ్యూన్ నిష్క్రమణకు పేలవ ప్రదర్శనకు ముడిపెడుతున్నారు. అందులో నిజం ఉందా?**

మంచిది, నేను అటువంటి తర్కాన్ని విశ్వసించను. కిమ్ జీ హ్యూన్ నా పక్కన లేనప్పుడు సైతం నేను ఎన్నో విజయాలు సాధించాను. ఎన్నో పతకాలు గెల్చుకున్నాను. నిజమే కిమ్ వచ్చిన తర్వాతనే నేను ప్రపంచ చాంపియన్ అయ్యాను. వ్యక్తిగత సమస్యలతో కిమ్ వెళ్లిపోవాల్సి వచ్చింది. కోచ్ చలువతోనే విజయం సాధించానని, ఆమె లేనందునే పరాజయం చవిచూస్తున్నాని నేను అనుకోను. అలా అనుకోవటం పూర్తిగా తప్పు అని నా భావన. ప్రస్తుతం పార్క్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నాను. గోపీచంద్ పర్యవేక్షణలో శిక్షణ బాగా సాగుతుంది. గెలుపు ఓటములు జీవితంలో భాగం. ఏ సమయంలోనైనా సానుకూల దృక్పథం, ధృడంగా నిలబడటం చాలా ప్రధానం.

• **టోక్యో ఒలింపిక్స్‌పై ప్రాతినిథ్యం అధికారికంగా వెలువడలేదు. అయినా, మీ ప్రాతినిథ్యం లాంఛనం కాబట్టి టోక్యో రెండో ఒలింపిక్స్ అనేస్తున్నాం. 2020 ఒలింపిక్స్‌పై మీ ఆలోచనలు ఎలా సాగుతున్నాయి?**

టోక్యో ఒలింపిక్స్‌పై ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. రియో ఒలింపిక్స్ పూర్తిగా భిన్నం, టోక్యో ఒలింపిక్స్ చాలా చాలా భిన్నమైనది. రియో ఒలింపిక్స్ సమయంలో సింధు పేరు పెద్దగా తెలియదు. రియోలో సింధు పతకం సాధిస్తుందని ఎవరూ ఊహించలేదు, సింధు నుంచి పతకం ఎవరూ ఆశించలేదు!. ఇప్పుడు పరిస్థితి వేరు. ప్రతి ఒక్కరు సింధు పతకం సాధించాలని కోరుకుంటున్నారు. పతకం సాధించే అథ్లెట్లలో నా పేరును మార్క్ చేస్తున్నారు. ఇది కొత్త బాధ్యతలు, ఒత్తిడిని తీసుకొస్తుంది. ఎంతో మంది అభిమానులు నేను పతకం సాధించాలని కోరుకుంటున్నారు, వారి కోసం పతకం నెగ్గాలనే సంకల్పంతోనే నేను ఆడతాను.. అందుకే బాధ్యతలను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంటాను. ఇంకో విషయం, నేను కోర్టులోకి అడుగుపెట్టినప్పుడు ఎటువంటి ఒత్తిడి ఉండదు. ఎంతో ప్రశాంతంగా బరిలోకి దిగి, ఆటపై పూర్తి ధ్యాస పెడతాను. నేను విజయం సాధిస్తే, అంతా సవ్యంగా సాగుతున్నట్టే లెక్క.

• **ఒలింపిక్స్‌లో నొజొమి ఒకుహర, తైజు యింగ్, చెన్ యుఫెయ్, కరోలినా మారిన్ సహా ఇతర ప్రధాన ప్రత్యర్థులు ఉన్నారు. ఒలింపిక్స్‌లో ప్రధాన ప్రత్యర్థుల సవాల్‌ను ఏ విధంగా స్వీకరించనున్నారు?**

ప్రతి క్రీడాకారిణి భిన్నమైన ఆలోచనశైలి, వ్యూహచతురత కలిగి ఉందని నేను అనుకుంటున్నాను. వీరితో ఆడిన ప్రతిసారీ అది కొత్త గేమే. ఇప్పుడు ఓ టోర్నీ ఆడిన తర్వాత.. వచ్చే టోర్నీలో సమరం పూర్తి భిన్నం. ఎందుకంటే కోర్టులో ఏం జరుగుతుంది, సరిచేసుకోవాల్సి అంశాలు ఏమున్నాయి? ప్రత్యర్థులు ఎలా ఆలోచిస్తున్నారు అనేది తెలిసిపోతుంది. కొత్త మ్యాచ్‌కు మళ్లీ కొత్త ప్రణాళిక కావాలి. ఒలింపిక్స్‌లో ప్రతి మ్యాచ్ కీలకమే. కానీ రియోతో పోల్చితే టోక్యో మరింత పోటీతత్వంగా ఉండనుంది. బ్యాడ్మింటన్ ప్రమాణాలు ఎంతగానో అభివృద్ధి చెందాయి. ర్యాంకింగ్స్‌లో 1-10 మంది షట్లర్లు సమానులే. విజయం ఎవరి పక్షం అనేది కేవలం ఆ రోజు కోర్టులో మెరుగైన ప్రదర్శన చేసిన వారిని బట్టి ఉంటుంది. ఒలింపిక్స్‌లో జూలైలో జరగనున్నాయి. అంతకముందు ఐదారు టోర్నీలు ఆడాల్సి ఉంది. ఇది ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ సమయం. అందరికీ ముఖ్యమైన షెడ్యూల్ ఇది. అందరి అంతిమ లక్ష్యం ఒలింపిక్స్ పతకం సాధించాలి. భారత్ నుంచి ఒలింపిక్స్ పతకం సాధించగల షట్లర్ ఎవరు అనగానే తైజు యింగ్ నా పేరు చెప్పటం బాగనిపించింది. ఒలింపిక్స్‌లో ప్రతి పాయింట్, ప్రతి మ్యాచ్ ఎంతో ఎంతో ప్రధానం.

# సెలక్టర్ల పనే అది!

## • మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్



**న్యూఢిల్లీ :** ఎమ్మెస్కే ప్రసాద్ సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో అత్యంత ఎక్కువ చర్చకు దారితీసిన అంశం ఎం.ఎస్ ధోని భవితవ్యం. ప్రసాద్ కమిటీ అనుభవంపై ప్రశ్నలు ఓవైపు, భవిష్యత్ ప్రణాళికలపై ధోనితో సెలక్టర్లు మాట్లాడారా? అని అందరూ చర్చించారు!. చీఫ్ సెలక్టర్‌గా ఇటీవల పదవీ కాలం ముగించుకున్న ఎమ్మెస్కే ఎం.ఎస్ ధోని భవిష్యత్‌పై వ్యవహరించిన తీరు పట్ల పెదవి విప్పాడు. 'సెలక్షన్ కమిటీ విషయానికి వస్తే యువ క్రికెటర్లకు వీలైనన్ని ఎక్కువ అవకాశాలు కల్పించటం, జట్టులో నిలదొక్కుకునే అవకాశం ఇవ్వటంపై మా దృష్టి నెలకొంది. ఎం.ఎస్ ధోని తన కెరీర్‌పై నిర్ణయం తీసుకోగలడు. సెలక్షన్ కమిటీ సభ్యుడిగా నా వృత్తి ధర్మాన్ని పక్కనపెడితే.. ధోనికి నా కంటే పెద్ద అభిమాని మరొకరు ఉండరు. ధోని అన్ని ఘనతలు సాధించాడు. రెండు ప్రపంచకప్‌లు, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ, టెస్టుల్లో నం.1 కిరీటం సాధించాడు. ధోనిని ఎవరూ ప్రశ్నించలేరు. అతని కెరీర్‌పై ధోనే నిర్ణయం తీసుకుంటాడు. సెలక్టర్లుగా భావితరం క్రికెటర్లను గుర్తించి, నిలకడగా అవకాశాలు కల్పించటం మా పని' అని ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు.

**రాయుడు పట్ల బాధపడ్డా! :** అంబటి రాయుడితో కలిసి డ్రెస్సింగ్‌రూమ్ పంచుకున్న ఆటగాడిగా అతడి విషయంలో ఎంతో బాధపడ్డాను. రాయుడు విషయంలో జరిగినది నా మనసుకు తగిలింది. 2016 జింబాబ్వే పర్యటన తర్వాత అంబటి రాయుడు టెస్టు ప్రణాళికల్లోకి రావాలని సెలక్షన్ కమిటీ భావించింది. అదే విషయాన్ని నేను రాయుడుతో ప్రస్తావించాను. ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా రాయుడిని వన్డేల్లోకి ఎంపిక చేశాం. ఎన్‌సీఏలో రాయుడు ఫిట్‌నెస్ మెరుగుపర్చేందుకు నెల పాటు సహకరించాం. అయినా, అతడి విషయంలో జరిగిన దానికి ఇప్పటికీ ఎప్పటికీ బాధపడతాను. ఇక కరుణ్ నాయర్ విషయానికొస్తే అందరూ ట్రిపుల్ సెంచరీ గురించే మాట్లాడతారు. కానీ కరుణ్ నాయర్ నిలకడగా రాణించలేకపోయాడు. కొడితే భారీ స్కోర్లు, లేదంటే స్వల్ప స్కోర్ల ప్రదర్శన కరుణ్ ఎంపికపై ప్రభావం చూపింది అని ప్రసాద్ అన్నాడు.

# సూపర్ సిరీస్ చర్చలు?



**కోల్‌కత :** ఆధునిక క్రికెట్‌లో సంచలన టోర్నీగా అంచనాలు అందుకుంటున్న సూపర్ సిరీస్ చర్చలు ఆరంభం కానున్నాయి!. బుధవారం కోల్‌కత నుంచి బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ లండన్ బయల్దేరాడు. ఈసీబీ ఉన్నతాధికారులతో గంగూలీ సూపర్ సిరీస్‌పై కీలక చర్చలు జరుపనున్నాడు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఉన్నతాధికారులు సైతం ఈ సమావేశానికి హాజరు కానున్నట్టు సమాచారం. ' గంగూలీ బుధవారం కోల్‌కత నుంచి ఇంగ్లాండ్‌కు బయల్దేరాడు. నాలుగు దేశాల సూపర్ సిరీస్‌పై అక్కడ చర్చలు జరుపుతాడు. క్రికెట్ ఆస్ట్రేలియా అధికారులు సైతం పాల్గొననున్నారు. సూపర్ సిరీస్‌పై పురోగతిపై పూర్తి స్పష్టత రావాల్సిన కొన్ని అంశాలు ప్రభావం చూపనున్నాయి' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఐసీసీ నిబంధనల ప్రకారం ముక్కోణపు టోర్నీ నిర్వహణకు సభ్య దేశాలు నిర్ణయం తీసుకోవచ్చు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నిర్వహించే ఆసియా కప్‌నకు మినహా మరో మూడు, అంతకంటే ఎక్కువ దేశాలు పాల్గొనే టోర్నీ నిర్వహించే హక్కు సభ్య దేశాలకు లేదు. ఈ విషయంలో బీసీసీఐ, ఈసీబీ, సీఏలు ప్రస్తుత సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

---

# ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలి: నామా



**నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వరరావు తెలిపారు. అందుచేతనే డబుల్ బెడ్ రూం హౌసింగ్ పథకానికి టీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంపై ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం నిర్మాణం కోసం రూ.6.50 వేలు ఖర్చు చేస్తుందని వివరించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద ప్రతి ఇంటికి కేంద్రం రూ. 1.50 లక్షల మాత్రమే ఇస్తోందని చెప్పారు. గృహ నిర్మాణం కోసం ఇచ్చే మొత్తాన్ని కేంద్రం పెంచాలని డిమాండ్ చేశారు. దీనికోసం భూమికి అయ్యే ఖర్చును కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కాగా, నామా ప్రసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్ జోక్యం చేసుకొని సదరు ఎంపీ అబద్ధం చెబుతున్నారని అన్నారు.

**ఫ్లోరైడ్ ఫ్రీ హబిటేషన్ సెంటర్లకు రూ. 700 కోట్లు ఇచ్చాం : కేంద్ర జల్‌శక్తి శాఖ**

తెలంగాణలో ఫ్లోరైడ్ రహిత కేంద్రాల ద్వారా తాగునీటి క్వాలిటీని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేసినట్టు జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చెప్పారు. తెలంగాణలో ఫ్లోరైడ్ రహిత కేంద్రాలను ఎన్నింటిని ఏర్పాటు చేశారని టీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు.. రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో 120 ఫ్లోరైడ్ ఫ్రీ హబిటేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్టు కేంద్రమంత్రి తెలిపారు. ఇందు కోసం 2017 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 700.23 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించారు.

# ప్రయివేటీకరణ దిశగా ప్రభుత్వవైద్యం

## కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకించిన కేరళ

**• మీనమేషాలు లెక్కిస్తున్న టీఆర్ఎస్ సర్కార్**


(ఫైల్)

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సమస్యలను పరిష్కరించకపోగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు వాటిని మరింత సంక్లిష్టంగా మార్చేలా ఉంటున్నాయి. బ్యాంకింగ్, రైల్వే తదితర రంగాల్లో ప్రభుత్వరంగాన్ని తగ్గిస్తూ కార్పొరేట్, ప్రయివేట్‌కు అప్పగిస్తున్న కేంద్రం ప్రభుత్వవైద్యంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని కల్పించే విషయాన్ని పరిశీలిస్తున్నది. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి ఆ కాలేజీకి జిల్లా ఆస్పత్రిని అనుసంధానించాలని భావిస్తున్నట్టు తెలియజేయాలి. అయితే వీటి నిర్వహణ ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ఉంటుందని స్పష్టం చేసింది.

ఇప్పటికే వైద్యచికిత్సలు, వైద్యవిద్యలో 60 నుంచి 70 శాతం ప్రయివేటు, కార్పొరేట్ల పరిధిలోకి వెళ్తే, 30 నుంచి 40 శాతం మేరకు మాత్రమే ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. అయితే ప్రభుత్వ వైద్యం, వైద్యవిద్యపై ఆధారపడే పేద, మధ్యతరగతి ప్రజలు మాత్రం 70 నుంచి 80 శాతం వరకుండగా వారికి మెరుగైన సేవలందించలేకపోతున్న సంగతి తెలిసిందే. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు బెడ్లు, డాక్టర్లు, నర్సులు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో వైద్యం కోసం పేదరోగులు నిరంతరం వేచిచూసే పరిస్థితి నెలకొన్నది. అత్యవసర పరిస్థితుల్లో ప్రయివేటును ఆశ్రయించక తప్పనిసరి. అలాంటి సందర్భాల్లో పేదలు ఎలా అప్పులపాలవుతున్నారనే విషయాలను నేషనల్ హెల్త్ ప్రొఫైల్, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్)తో పాటు జాతీయంగా, అంతర్జాతీయంగా పలు సంస్థలు నిర్వహించిన సర్వేలు, అధ్యయనాల్లో బయటపడిన విషయం విదితమే. సామాన్యులకు నిత్యానుభవమే. దీనికి తోడు తాజా నిర్ణయంతో ఉన్న కొద్ది ప్రభుత్వ అధీనంలోని సేవల్లో కూడా ప్రయివేటుకు భాగస్వామ్యం కల్పించడమంటే పేదలకు వైద్యాన్ని మరింత దూరం చేయడమే అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

దీనిపై కేంద్రం రాష్ట్రాల నుంచి అభిప్రాయాలను కోరనున్నట్టు సమాచారం. అయితే ఇప్పటికే ప్రయివేటీకరణను అనుమతించి సామాన్యుల వైద్యాన్ని భారంగా మార్చే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని వామపక్ష ప్రభుత్వ పాలనలో ఉన్న కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.కె.శైలజ నిర్ద్వందంగా వ్యతిరేకించింది. టీఆర్ఎస్ సర్కార్ మాత్రం ఈ విషయంలో ఎలాంటి కామెంట్లు చేయకుండా మిన్నకుండిపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఆదిలోనే వ్యతిరేకించాల్సిన, అడ్డుకోవాల్సిన అవసరముందని ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకున్న గ్రామీణులకు సగటున రూ.14,935 ఖర్చవుతుండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన వ్యక్తి రూ.24,436 ఖర్చు చేస్తున్నట్టు 71వ ఆరోగ్య సర్వే తేల్చింది. గత ఐదేండ్లలో ఇది మరింత పెరిగినట్టుగా గుర్తించారు. చికిత్సపొందే సమయంలో కుటుంబంలో సంపాదించే వ్యక్తులకు ఆదాయం కూడా తగ్గడం మరోవైపు ఖర్చులు పెరగడం భారంగా మారుతున్నది. ఈ పరిస్థితుల్లో ప్రజావైద్యాన్ని మరింత విస్తృతం చేయాల్సిన చేయాల్సిందిపోయి, ప్రయివేటీకరణ ఆలోచన చేయడం సరికాదనే అభిప్రాయాలు వస్తున్నాయి.

---

# మద్దతునివ్వని కేంద్రం

## ఎంఎస్‌పీని పెంచాలని కోరినా పట్టించుకోని మోడీ సర్కారు

- బీజేపీ పాలిత రాష్ట్రాలపైనా అదే తీరు
- అడిగిందొకటి.. ఇచ్చిందొకటి
- రైతులకు బోనస్ ఇస్తే పంట ఉత్పత్తులు కొనబోమని హెచ్చరిక
- అంతిమంగా నష్టపోతున్నది అన్నదాతలే..

| క్రసం. | పంట రకం | ధర (క్వింటాలుకు) |
|---|---|---|
| 1 | వరి | రూ. 1,815 |
| 2. | రాగులు | రూ. 3,100 |
| 3. | మొక్కజొన్న | రూ. 1,760 |
| 4. | కందులు | రూ. 5,800 |
| 5. | మినుములు | రూ. 5,700 |
| 6. | పొద్దుదిరుగుడు | రూ. 6,485 |
| 7. | నువ్వులు | రూ. 6,485 |
| 8. | పత్తి | రూ. 5,255 |



**న్యూఢిల్లీ :** 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ సర్కారు ఇప్పటివరకూ ఆ దిశగా తీసుకుంటున్న చర్యలేమీ లేవని ఓ వైపు వాదనలు వినిపిస్తుండగా.. మరోవైపు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అయినా పెంచాలని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. స్వయంగా బీజేపీ పాలిత రాష్ట్రాలు కోరినా కేంద్రం విముఖతనే చూపిస్తున్నది. ఒక్కో రాష్ట్రంలో పంటల ఉత్పత్తులకయ్యే ఖర్చులకు తగ్గట్టు ఆయా రాష్ట్రాలు ఎంఎస్‌పీని నిర్ణయించాలని కోరినా కేంద్రం వాటిని పెడచెవిన పెడుతున్నది. దీంతో గతేడాది ఖరీఫ్ సీజన్‌కు గానూ ఎంఎస్‌పీని పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత దానిని వ్యతిరేకిస్తూ పలు రాష్ట్రాలు కేంద్రానికి లేఖ రాశాయి. ఈ ధరలను మరోసారి సమీక్షించాలని విజ్ఞప్తులు చేసినా కేంద్రం దానికి నిరాకరించిందని 'ది వైర్' చేసిన పరిశోధనలో తేలింది.

2019-20 ఖరీఫ్ పంటల ఎంఎస్‌పీకి సంబంధించి గతేడాది జూన్ 3న సమావేశమైన క్యాబినెట్ పలు పంటలకు మద్దతు ధర పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సీజన్‌కు గానూ అంతకుముందు ఏడాదితో పోల్చితే వరికి 3.7 శాతం, జొన్నలు 4.9 శాతం, చిరుధాన్యాలకు 2.6 శాతం, మొక్కజొన్నకు 3.5 శాతం పెంచింది. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సూచనల మేరకు ప్రధాని నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ దీనికి ఆమోదముద్ర వేసింది. దీనిని అన్ని రాష్ట్రాలకు పంపగా.. ఛత్తీస్‌గఢ్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు, ఒడిషా, కర్నాటక, బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ ఉత్తర్వులను నిరసిస్తూ లేఖలు రాశాయి. స్వామినాథన్ సిఫారసులు అమలుచేయాలనీ, ఈ ధరలను పున:పరిశీలించాలని కోరినా కేంద్రం మాత్రం రైతుల మొర వినలేదు. మరోసారి వారికి మొండిచేయి చూపించింది.

గతేడాది ఖరీఫ్‌కు పలు పంటలకు సీఏసీపీ నిర్ణయించిన ధరలు

**ఈ ధరలపై పలు రాష్ట్రాలు చేసిన అభ్యంతరాలు..**

**ఛత్తీస్‌గఢ్ :** వరి అధికంగా పండించే రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్ ఒకటి. కేంద్రం పెంచిన ధరలు తమ రైతులకు ఏమాత్రం సరిపోవనీ, పెరిగిన ఖర్చుల (రుణాలపై వడ్డీ, భూమి కౌలు, సాగు వ్యయం, రవాణా ఖర్చులు) దృష్ట్యా కింద పేర్కొన్న పంటలకు ఎంఎస్‌పీని పెంచాలని అది కేంద్రానికి తెలిపింది.

**ఛత్తీస్‌గఢ్ కోరిన ఎంఎస్‌పీ వివరాలు**

1. వరి రూ. 2,500 (క్వింటాలుకు) 2. మొక్కజొన్న రూ. 1,800 3. రాగులు రూ. 3,100 4. కందులు, పెసర్లు రూ. 6,800 5. సోయాబిన్ రూ. 3,800 6. పొద్దుదిరుగుడు రూ. 6,500కు పెంచాలని కోరింది. సీఏసీపీతో పోల్చితే తమ రాష్ట్రంలో సాగు వ్యయం ఎక్కువగా ఉన్నదనీ, ఈ ధరలను తక్షణమే మార్చాలని అది డిమాండ్ చేసింది. అయితే ఈ ప్రతిపాదనను కేంద్రం అంగీకరించలేదు. సీఏసీపీ నిర్ణయించేందే ఫైనల్ అని తేల్చేసింది. దీంతో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని (వరి రూ. 2,500కు కొనుగోలు) నిలబెట్టుకోవడానికి రైతులకు మిగిలిన డబ్బులను బోనస్ రూపంలో అందిస్తామని చెప్పింది. కానీ దీనికీ కేంద్రం అడ్డుపడింది. అలా చేస్తే రాష్ట్రం నుంచి ఉత్పత్తయ్యే పంటలను తాము కొనబోమని మెలిక పెట్టింది.

**మహారాష్ట్ర :** కేంద్రం పంపిన ఉత్తర్వులకు అప్పటి దేవేంద్ర ఫడ్నవీస్ సర్కారు స్పందిస్తూ.. తమ రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటుందనీ, ఎంఎస్‌పీని పెంచాలని కేంద్రాన్ని కోరింది. వరికి రూ. 3,921, జొన్నలకు రూ. 3,628, చిరుధాన్యాలకు రూ. 4,002, మొక్కజొన్నకు 2,001, కందులకు రూ. 6,161, పెసర్లకు రూ. 9,943, వేరుశెనగకు రూ. 9,416, పత్తికి రూ. 7,664లు ధర నిర్ణయించాలని విజ్ఞప్తి చేసింది. అయితే మోడీ సర్కారు దీనిని పక్కనబెట్టింది. అంతేగాక రైతులకు బోనస్ ఇస్తే పంటలు కొనబోమని హెచ్చరికలు జారీ చేసింది.

**హర్యానా :** దేశానికి అన్నం పెడుతున్న అతి కొద్ది రాష్ట్రాలలో హర్యానా ఒకటి. కేంద్రం ప్రతిపాదించిన ధరలను కాదనీ, ఖట్టర్ నేతృత్వంలోని సర్కారు కొన్ని విజ్ఞాపనలను చేసింది. ఢిల్లీకి సమీపంలో ఉండటంతో ఇక్కడ యంత్రాల ఖర్చుతో పాటు పెట్టుబడి వ్యయం కూడా అధికంగా అవుతుందని అది వాపోయింది. ఈ కారణంగా వరికి రూ. 2,700, చిరుధాన్యాలకు రూ. 2,170కి పెంచాలని డిమాండ్ చేసింది. పంజాబ్, హర్యానాలలో వరి పంటను ఎక్కువ వేస్తుండటంతో నీటి ఎద్దడి నెలకొందనీ, దీనిని అధిగమించడానికి మొక్కజొన్న, పత్తిని పండించాలని కేంద్రం సూచించిన విషయం తెలిసిందే. అయితే ఈ రెండు పంటలకు సైతం కేంద్రం ఎంఎస్‌పీ పెంచలేదు. పత్తికి రూ. 7 వేలు, మొక్కజొన్నకు రూ. 2,350 పెంచి ఉంటే రైతులు కూడా పంటలు మార్చడానికి ముందుకొచ్చేవారని ఇరు రాష్ట్రాలు చెప్పినా బీజేపీ సర్కారు పట్టించుకోలేదు.

**ఉత్తరప్రదేశ్ :** మోడీ సర్కారు ఏది చెప్పినా తూచా తప్పకుండా అమలు చేసే యోగి సర్కారు సైతం ఎంఎస్‌పీని పెంచాలని కేంద్రాన్ని వేడుకుంది. రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఉండటం వల్ల ఎంఎస్‌పీ పెంచితే అది వారికి ఎంతో ఉపయోగకరమనీ, తద్వారా లక్షలాది మంది రైతు కూలీల వేతనాలు సైతం పెరిగే అవకాశమున్నదని కేంద్రానికి తెలిపింది. వరికి రూ. 2,520, మిల్లెట్లకు రూ. 2,265, పెసర్లు, కందులకు రూ. 6,375, నువ్వులకు రూ. 6,660 పెంచాలని వేడుకుంది. కానీ, యోగి కోరికలను మోడీ కరుణించలేదు.

**బెంగాల్ :** కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సెక్రెటరీ సంజయ్ అగర్వాల్ పంపిన ఉత్తర్వులకు రాష్ట్ర ప్రభుత్వం బదులిస్తూ.. సీఏసీపీ ధరలు తమకు అనుకూలంగా లేవని బదులిచ్చింది. బెంగాల్‌లో వరికి సుమారు రూ. 1,751 (క్వింటాలుకు) ఖర్చవుతున్నదనీ, దీనికి ఎంఎస్‌పీగా రూ. 2,100 ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాసింది. కానీ కేంద్రం దీనిని పట్టించుకోలేదు.

వీటితో పాటు ఒడిషా, రాజస్థాన్, కర్నాటక, తమిళనాడులు సైతం సీఏసీపీ ప్రతిపాదనలను సమీక్షించాలని కోరినా కేంద్రం వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్ర నిర్ణయంతో అంతిమంగా నష్టపోతున్నది ప్రజలేనని వ్యవసాయరంగ నిపుణులు అంటున్నారు. ఇలాగే చేస్తే కేంద్రం హామీ ఇచ్చినట్టు మరో రెండేండ్లలో రైతుల ఆదాయం రెట్టింపవడం అసాధ్యమని వారు విశ్లేషణలు చేస్తున్నారు. మద్దతు ధర పెంచకుండా రైతులకు మాయమాటలు చెబుతూ కాలం వెల్లదీయడం వల్ల వారికి ఒనగూరదేమీ లేదని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్వామినాథన్ సిఫారసులను అమలుచేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

epaper.navatelangana.com